www.udyamakeratam.com

RNI: TGTEL/25/A0273

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 127 | 29-10-2026 | గురువారం | పేజీలు: 8 | వెల : రూ.2/- |



## ఇంట్లో లేకుంటే ఓటు తీసేస్తారా?

### ఈసీ తీరుపై సుప్రీంకోర్టు సీరియస్

- అడ్రస్ మారితే కొత్తగా నమోదు చేసుకోవాలా?
- ఫారం-8 అవకాశం ఎందుకు ఇవ్వరని ప్రశ్న
- ఓటర్ల అభ్యంతరాల గడువు పెంచుతామన్న ఈసీ

3

ఢిల్లీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై దాఖలైన పిటిషన్ల విచారణలో సుప్రీంకోర్టు ఎన్నికల సంఘం (ఈసీ) తీరుపై కీలక ప్రశ్నలు సంధించింది.

---

## ఉద్యోగులకు కేంద్ర కేబినెట్ తీపికబురు

3

డీఏ, డీఆర్ కోసం రూ.10,016 కోట్లు కేటాయింపు

## కరువు సాయం కోసం ఢిల్లీకి!



- ఎల్‌నినో ముప్పును ఎదుర్కొనేందుకు సర్కార్ సిద్ధం
- కేంద్రానికి ఇప్పటికే కరువు పరిస్థితులపై నివేదిక
- త్వరలో ఢిల్లీకి అఖిలపక్ష ప్రతినిధి బృందం
- రాజకీయాలకు అతీతంగా కలిసిరావాలని పిలుపు
- అఖిలపక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2

## రైతుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యం!

- కరువుపై నిర్మాణాత్మక దృక్పథంతో ముందుకెళ్తాం
- అంతర్రాష్ట్ర నదీజలాల అంశంలో వెనక్కి తగ్గేది లేదు
- మంత్రి ఉత్తమ్ స్పష్టీకరణ

2

# నిర్మాణాలకు ఇక శుద్ధి చేసిన నీరే!

### హైదరాబాద్ కు నీటి కష్టాలు రాకుండా ముందస్తు చర్యలు



హైదరాబాద్ నగరంలో భవిష్యత్తులో తాగునీటి ఎద్దడి రాకుండా తెలంగాణ ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. ఎల్‌నినో ప్రభావం వల్ల నీటి కష్టాలు ఎదురవకుండా ఉండేందుకు ముందస్తు ప్రణాళికలు రచిస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తాగునీటి కొరత తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నది.

**హైదరాబాద్, అక్టోబర్ 28 (ఉద్యమ కెరటం):** నీటి వృథాను అరికట్టేందుకు మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్‌టీపీలు) పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. అధికారులతో బుధవారం జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో ఆయన ఈ మేరకు కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నగరంలో తాగునీటి సమస్య రాకుండా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. నవంబర్ 1 నుంచి ట్రీటెడ్ వాటర్‌కు సంబంధించిన కొత్త నిబంధనలు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త భవన నిర్మాణ అనుమతుల

మిగతా 2 లో

- ఎల్‌నినో ముప్పుతో అప్రమత్తం
- నవంబర్ 1 నుంచి కొత్త మార్గదర్శకాలు
- భవన నిర్మాణాలకు ట్రీటెడ్ వాటర్ తప్పనిసరి
- ఏఐ టెక్నాలజీతో మురుగునీటి శుద్ధి ప్రక్రియ
- ఎస్టీపీల పర్యవేక్షణకు రంగంలోకి హైడ్రా
- ప్రభుత్వ కార్యాలయాలు, ఓఆర్ఆర్‌లో వందశాతం వాడకం
- నీటి సరఫరా కోసం టోల్ ఫ్రీ
- ఎస్టీపీల నిర్వహణకు సోలార్ విద్యుత్: సీఎం రేవంత్

---




## ఐఏఎస్‌ల బదిలీలు!

### అటవీ శాఖకు జయేష్ రంజన్



- విద్యుత్ శాఖకు వికాస్ రాజ్
- పంచాయతీరాజ్ శాఖకు నవీన్ మిట్టల్
- పలువురికి అదనపు బాధ్యతలు అప్పగింత

వివరాలు 2లో..



## 15 సెకన్లలోనే నేరస్థుడి గుర్తింపు!

నేర పరిశోధనలో తెలంగాణ పోలీసుల డిజిటల్ దూకుడు

2

అనుమానితుల ముఖాల గుర్తింపునకు మొబైల్ ఫేస్ సెర్చ్ యాప్



4

## కాంగ్రెస్‌కు సీట్లు ఎన్నో చెప్పండి!

కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రాలు



## టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నారు

4

- రాహుల్ గాంధీ ఆరోపణలు

## రైల్వే నిలయం వద్ద కాంగ్రెస్ ధర్నా!

ఢిల్లీ ర్యాలీకి ప్రత్యేక రైళ్ల నిరాకరణపై ఆందోళన

టీపీసీసీ చీఫ్, మంత్రులు, ఎమ్మెల్యేల అరెస్టు

- నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో ఇండీ కూటమి ర్యాలీ
- సీఈసీని తొలగించాలంటూ లక్షలాది మందితో ప్రదర్శన

3



ఢిల్లీలో నవంబర్ 1న కాంగ్రెస్ తలపెట్టిన నిరసన కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలని కోరగా దక్షిణ మధ్య రైల్వే నిరాకరించింది. దీంతో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు ధర్నాకు దిగారు.

## నవంబర్ 2న బీజేపీ మహా పాదయాత్ర!

### ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ దుష్ప్రచారానికి నిరసన

ముఖ్య అతిథిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా



3



## కరువు జాబితాలో కరీంనగర్‌కు అన్యాయం!

- ఎంపిక అశాస్త్రీయమన్న బండి సంజయ్
- ప్రమాణాలు, గణాంకాలు వెల్లడించాలని డిమాండ్

3

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
గురువారం 29 అక్టోబర్ 2026



# రైతుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యం!

**కరువుపై నిర్మాణాత్మక దృక్పథంతో ముందుకెళ్తాం**

**అంతర్రాష్ట్ర నదీజలాల అంశంలో వెనక్కి తగ్గేది లేదు**

**అఖిలపక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్ స్పష్టీకరణ**

**ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై నేతల సలహాల స్వీకరణ**

**హైదరాబాద్, అక్టోబర్ 28 (ఉద్యమ కెరటం):** ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న కరువు పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం సానుకూల, నిర్మాణాత్మక దృక్పథంతో ముందుకు సాగుతుందని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు. అంతర్రాష్ట్ర నదీజలాల అంశాల్లో రాష్ట్రంతో పాటు తెలంగాణ రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సచివాలయంలో బుధవారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. వర్షపాతం లోటు, కరువు పరిస్థితుల వల్ల ప్రజలు, రైతులపై పడే ప్రభావాన్ని తగ్గించే చర్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. తాగునీటి సరఫరా, నీటి వనరుల పరిరక్షణ, సాగునీటికి విద్యుత్ సరఫరా, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక తదితర అంశాలపై అఖిలపక్ష నాయకుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. తదుపరి కార్యాచరణలో వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ హామీ ఇచ్చారు. ప్రకృతి విపత్తును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, వాకిటి శ్రీహరి, సీఎస్ సంజయ్ జాజు, నోడల్ అధికారి రామకృష్ణారావు పాల్గొన్నారు.

# 15 సెకన్లలోనే నేరస్థుడి గుర్తింపు!

**నేర పరిశోధనలో తెలంగాణ పోలీసుల డిజిటల్ దూకుడు**

**అనుమానితుల ముఖాల గుర్తింపునకు మొబైల్ ఫేస్ సెర్చ్ యాప్**

**స్మార్ట్ ఫోన్‌తోనే వేలిముద్రలను సరిపోల్చే నూతన వ్యవస్థ**

**ఏడు నూతన డిజిటల్ సేవలను ప్రారంభించిన డీజీపీ ఆనంద్**

**హైదరాబాద్, అక్టోబర్ 28 (ఉద్యమ కెరటం):** తెలంగాణ పోలీసు శాఖ నేర పరిశోధనలో వేగం పెంచేందుకు సరికొత్త టెక్నాలజీని వాడుకుంటోంది. క్షేత్రస్థాయి పోలీసులకు సాంకేతిక ఆధారాలను తక్షణమే అందించేలా ఏడు నూతన డిజిటల్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. అనుమానితుల ముఖాలను కేవలం 15 సెకన్లలో గుర్తించే యాప్, సంఘటనా స్థలంలో లభించిన వేలిముద్రలను సాధారణ స్మార్ట్‌ఫోన్‌తోనే సరిపోల్చే వ్యవస్థ వీటిలో ప్రధానమైనవి. డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డీజీపీ సి.వి. ఆనంద్ ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించారు. సీఐడీ ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ ఫేస్ సెర్చ్ యాప్ ద్వారా పాత నేరస్థులను ఇట్టే పసిగట్టొచ్చు. ఈ యాప్ రాష్ట్రవ్యాప్తంగా 9.8 లక్షలకు పైగా నేరస్థుల ఫొటోలతో కూడిన డేటాబేస్‌తో అనుసంధానమై పనిచేస్తుంది. అనుమానితుడి ఫొటోను ఫోన్‌తో తీసిన 15 సెకన్లలోనే రికార్డులతో సరిపోల్చి, అతడి గత నేర చరిత్ర, పెండింగ్ కేసుల వివరాలను చూపుతుంది. తప్పిపోయిన వ్యక్తులు, అనాథలు, గుర్తుతెలియని మృతదేహాలను గుర్తించడానికి కూడా ఈ యాప్ ఉపయోగపడుతుంది.

**స్మార్ట్ ఫోన్‌తోనే వేలిముద్రలు..**



క్రైమ్ సీన్ ఛాన్స్ ప్రింట్ యాప్‌తో సంఘటనా స్థలంలో దొరికే వేలిముద్రలను ఆండ్రాయిడ్ ఫోన్‌తో స్కాన్ చేసి నేరుగా రాష్ట్ర సర్వర్‌కు పంపవచ్చు. అక్కడి ఫింగర్‌ప్రింట్ డేటాబేస్‌తో వాటిని సరిపోల్చి నిందితుడి వివరాలను నిమిషాల వ్యవధిలోనే గుర్తించే అవకాశం కలుగుతుంది. దీంతో ప్రయోగశాల నివేదికల కోసం రోజుల తరబడి ఎదురుచూసే సమయం భారీగా తగ్గనుంది. పోలీసు సేవల్లో జవాబుదారీతనం పెంచేందుకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ సెంటర్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. ఎఫ్ఐఆర్ నమోదు, పిటిషన్ల పరిష్కారం, ఈ-చలాన్లు, పాస్‌పోర్టు ధ్రువీకరణ వంటి సేవలపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి సిబ్బంది పనితీరును సమీక్షిస్తారు. రాష్ట్రంలో ఉన్న 35 భరోసా కేంద్రాలను ఏకీకృత సాఫ్ట్‌వేర్‌తో అనుసంధానించి, బాధితులకు అందించే కౌన్సెలింగ్, వైద్య, న్యాయ సహాయ సేవలను డిజిటల్ విధానంలో పర్యవేక్షిస్తారు.

**విడుదలైన ఖైదీలపై నిఘా..**

జైలు నుంచి ఖైదీ విడుదలైన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు ఆటోమేటిక్ గా సమాచారం చేరేలా ఈ-ప్రిజన్స్ వ్యవస్థను సీసీటీఎన్ఎస్‌తో అనుసంధానించారు. జైలు విడుదలైన ఖైదీల నిర్వహణ వ్యవస్థ (జేఆర్ఎంఎస్) ద్వారా పాత నేరస్థుల కదలికలను విశ్లేషించి నిఘా ఉంచుతారు. దర్యాప్తు నాణ్యతను పెంచి, శిక్షల ఖరారు శాతం మెరుగుపరిచేందుకు ఐదు సంపుటాల ప్రామాణిక కార్యాచరణ విధానాలను (ఎస్ఓపీలు) విడుదల చేశారు. సీఐడీ సేవలు, సమాచారం కోసం సీఐడీ.టీఎస్ పోలీస్.జీఓవీ.ఇన్ పేరిట ప్రత్యేక వెబ్‌సైట్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. ఈ డిజిటల్ సేవల ప్రారంభోత్సవ కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ డీజీ మహేష్ భగవత్, సీఐడీ డీజీ చారు సిన్హా, అదనపు డీజీ అకున్ సబర్వాల్, ఐజీ గజరావు భూపాల్, డీఐజీలు నారాయణ నాయక్, పరిమళ హన నూతన్, ఎస్పీలు విశ్వజిత్ కంపాటి, రూపేష్, ప్రవీణ్ కుమార్, మల్లారెడ్డి, బాలకోటి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణాలకు ఇక శుద్ధి చేసిన నీరే!

(మొదటి పేజీ తరువాయి..)

మంజూరులో శుద్ధి చేసిన నీటి వినియోగాన్ని తప్పనిసరి చేస్తూ నిబంధనలు తీసుకురావాలని సీఎం ఆదేశించారు. సచివాలయం, ముఖ్యమంత్రి కార్యాలయం, ప్రభుత్వ పార్కులు, ఔటర్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు పరిధిలో పచ్చదనం నిర్వహణకు, రోడ్ల శుభ్రతకు వంద శాతం ట్రీటెడ్ వాటర్ వాడాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇతర అవసరాలకు కూడా ఈ నీటినే వాడేలా తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. అలాగే అధికంగా నీటిని వినియోగించే డేటా సెంటర్లకు కూడా శుద్ధి చేసిన నీటినే సరఫరా చేయాలని సూచించారు. ప్రైవేటు ఎస్టీపీల ఏర్పాటును సైతం ప్రోత్సహించాలని అధికారులకు వివరించారు.

**ఎస్టీపీలపై హైడ్రా నిఘా..**

మురుగునీటి శుద్ధి నాణ్యతలో ఏమాత్రం రాజీ పడొద్దని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ప్లాంట్లలో కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను వినియోగించాలని, ప్రతి కేంద్రానికి ప్రత్యేక అధికారిని నియమించి, అన్నింటినీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించాలని ఆదేశించారు. ఈ ఎస్టీపీల పనితీరును ఇకపై హైడ్రా నిరంతరం పర్యవేక్షిస్తుందని వెల్లడించారు. అలాగే ఎస్టీపీల నిర్వహణ వ్యయం తగ్గించేందుకు అవసరమైన సౌర విద్యుత్‌ను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని రెడ్కో అధికారులకు సూచించారు.



**సరఫరాకు టోల్ ఫ్రీ నంబర్..**

శుద్ధి చేసిన నీటి వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాలని, నీటి కొనుగోలు, సరఫరా కోసం ప్రత్యేకంగా ఓ టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ట్రీటెడ్ వాటర్ సరఫరా చేసే గ్రీన్ ట్యాంకర్ల కదలికలను ఎప్పటికప్పుడు ట్రాక్ చేసేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. కాగా, ప్రస్తుతం నగరంలోని 26 ఎస్టీపీల నుంచి కేవలం రవాణా రుసుము మాత్రమే తీసుకుని గ్రీన్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఈ సమీక్షలో జలమండలి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

# కరువు సాయం కోసం ఢిల్లీకి!

- ఎల్‌నినో ముప్పును ఎదుర్కొనేందుకు సర్కార్ సిద్ధం
- కేంద్రానికి ఇప్పటికే కరువు పరిస్థితులపై నివేదిక
- త్వరలో ఢిల్లీకి అఖిలపక్ష బృందం
- రాజకీయాలకు అతీతంగా కలిసిరావాలని పిలుపు
- అఖిలపక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, అక్టోబర్ 28 (ఉద్యమ కెరటం):** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడిన వర్షాభావం, కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రజా ప్రభుత్వం పూర్తి సన్నద్ధతతో ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సచివాలయంలో బుధవారం ఆయన అధ్యక్షతన కరువు పరిస్థితులు, ముందస్తు జాగ్రత్తలపై అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపామని, విపత్తును ఎదుర్కొనేందుకు అన్ని పార్టీల సూచనలతో సమష్టి కార్యాచరణతో ముందుకు వెళ్తామని వెల్లడించారు.

**కేంద్రంపై ఒత్తిడికి ఢిల్లీకి..**

రాష్ట్రానికి రావాల్సిన సహాయం కోసం అవసరమైన సమయంలో అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర మంత్రులను కలుస్తామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. విపత్తు పరిస్థితులను ఎదుర్కొనే సమయంలో రాజకీయ విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వకుండా, ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వానికి అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. గతంలో కరోనా వంటి సంక్షోభాల సమయంలో ప్రభుత్వాలు, పార్టీలు సమన్వయంతో పనిచేసిన స్ఫూర్తిని ఆయన గుర్తుచేశారు. నేతలు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని, ఆచరణ సాధ్యమైన వాటిని ప్రభుత్వ కార్యాచరణలో భాగంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

**తాగునీటి వసతిపై ప్రత్యేక దృష్టి..**

తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాలు, దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ వర్షపాతం లోటు ఉండటం ఆందోళన కలిగించే అంశమని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ ప్రాంతాల నుంచి నీటి లభ్యత తగ్గిన పరిస్థితుల్లో జలవనరుల నిర్వహణ మరింత కీలకంగా మారిందన్నారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకుని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు, పశువులకు తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. అవసరమైన నీటి వసతులు కల్పించేందుకు బడ్జెట్, ఇతర ఏర్పాట్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ సమావేశంలో కేబినెట్ సబ్ కమిటీ సభ్యులు, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, వాకిటి శ్రీహరి, సీఎస్ సంజయ్ జాజు, ఎల్‌నినో నోడల్ అధికారి రామకృష్ణారావు పాల్గొన్నారు. అలాగే బీఆర్ఎస్ నుంచి వినోద్ కుమార్, ఎల్.రమణ, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, బీజేపీ నుంచి ఏలేటి మహేశ్వర్ రెడ్డి, కొమురయ్య, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, అక్బరుద్దీన్ ఒవైసీ, కాంగ్రెస్ నుంచి అంజన్ కుమార్ యాదవ్, కోదండ రెడ్డి, వామపక్షాల నేతలు పల్లా వెంకటరెడ్డి, సాంబశివరావు, జాన్ వెస్లీ, టీజేఎస్ నుంచి కోదండరాం సహా ప్రతినిధులు పలు కీలక సూచనలు చేశారు.




# రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు!

**అటవీ శాఖకు జయేష్ రంజన్.. విద్యుత్ శాఖకు వికాస్ రాజ్**

**పంచాయతీరాజ్ శాఖకు నవీన్ మిట్టల్**

**పలువురికి అదనపు బాధ్యతలు అప్పగింత**

**హైదరాబాద్, అక్టోబర్ 28 (ఉద్యమ కెరటం):** తెలంగాణ రాష్ట్రంలో భారీ స్థాయిలో ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. పరిపాలనా సౌలభ్యం, శాఖల పనితీరు మెరుగుదలే లక్ష్యంగా పలువురు సీనియర్ ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మార్పుల్లో కొందరికి అదనపు బాధ్యతలను కూడా ప్రభుత్వం అప్పగించింది. మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న జయేష్ రంజన్‌ను పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖకు బదిలీ చేసింది. ఆయనకు ఎప్ట్రీ డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు ఇచ్చింది. రవాణా, ఆర్అండ్‌బీ శాఖలో ఉన్న వికాస్ రాజ్‌ను విద్యుత్ శాఖకు పంపించింది. యువజన సర్వీసులు, పర్యాటక శాఖల బాధ్యతల్లో ఉన్న ఏ.వాణి ప్రసాద్‌కు క్రీడా శాఖతో పాటు హెరిటేజ్ తెలంగాణ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు కేటాయించింది. ఇంధన శాఖ నుంచి నవీన్ మిట్టల్‌ను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు బదిలీ చేసింది.

**పలువురికి అదనపు బాధ్యతలు..**

రెవెన్యూ (ఎండోమెంట్స్) శాఖ ప్రధాన కార్యదర్శిగా శైలజ రామయ్యర్‌ను, రవాణా, ఆర్అండ్‌బీ శాఖ కార్యదర్శితో పాటు రవాణా కమిషనర్‌గా డాక్టర్ కె. ఇలంబరితిని నియమించింది. రెవెన్యూ (విపత్తు నిర్వహణ) శాఖలో ఉన్న రాహుల్ బొజ్జాకు గిరిజన సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించింది. హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శితో పాటు జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల ప్రత్యేక అధికారిగా అదనపు బాధ్యతలు ఇచ్చింది. మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా శృతి ఓజా, డైరెక్టర్‌గా సంగీత సత్యనారాయణను ప్రభుత్వం నియమించింది. రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ సీఎండీగా ఉన్న ముషారఫ్ అలీ ఫరూఖీకి ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించింది. టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్‌కు టీజీరెడ్కో వైస్ చైర్మన్ ఎండీగా అదనపు బాధ్యతలు కేటాయించింది.

# రైల్వే నిలయం వద్ద కాంగ్రెస్ ధర్నా!

- రైల్వే నిలయం వద్ద కాంగ్రెస్ ధర్నా!
- ఢిల్లీ ర్యాలీకి ప్రత్యేక రైళ్ల నిరాకరణపై ఆందోళన
- టీపీసీసీ చీఫ్, మంత్రులు, ఎమ్మెల్యేల అరెస్టు
- నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో ఇండీ కూటమి ర్యాలీ
- సీఈసీని తొలగించాలంటూ లక్షలాది మందితో ప్రదర్శన

**హైదరాబాద్, అక్టోబర్ 28 (ఉద్యమ కెరటం):** ఢిల్లీలో నవంబర్ 1న కాంగ్రెస్ తలపెట్టిన నిరసన కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలని కోరగా దక్షిణ మధ్య రైల్వే నిరాకరించింది. దీంతో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ కార్యకర్తలు హైదరాబాద్‌లోని రైల్వే నిలయం వద్ద ధర్నాకు దిగారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని సికింద్రాబాద్ మార్కెట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**నవంబర్ 1న భారీ ర్యాలీ..**

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండీ కూటమి భారీ ర్యాలీ నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి దాదాపు 10 లక్షల మంది హాజరవుతారని కాంగ్రెస్ నేతలు వెల్లడించారు. ప్రత్యేక రైళ్లు ఇవ్వకపోయినా, ఎన్ని అడ్డంకులు ఎదురైనా లక్షలాది మంది ఢిల్లీకి చేరుకుంటారని వారు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

**ఓట్ బచావో-దేశ్ బచావో..**

ఓటర్ల జాబితాలో పారదర్శకత, పౌరుల ఓటు హక్కు పరిరక్షణ విషయంలో రాజీపడబోమని కాంగ్రెస్ నేతలు తేల్చిచెప్పారు. ఎన్నికల సంఘం తీరుతోపాటు ఓటర్ల జాబితాల సవరణలో జరుగుతున్న అక్రమాలకు నిరసనగా చేపట్టిన 'ఓట్ బచావోఉదేశ్ బచావో' ప్రచారానికి ఈ ఢిల్లీ ర్యాలీ ముగింపు కానుందని తెలిపారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడుతున్నామనే సందేశాన్ని ఈ ప్రదర్శన ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తామని వివరించారు.



ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక



# నవంబర్ 2న బీజేపీ మహా పాదయాత్ర!

- ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ దుష్ప్రచారానికి నిరసన
- ముఖ్య అతిథిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- ట్యాంక్‌బండ్‌పై వివేకానంద విగ్రహం నుంచి ప్రారంభం



**హైదరాబాద్, అక్టోబర్ 28 (ఉద్యమ కెరటం):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్, ఇండీ కూటమి చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు నవంబర్ 2న హైదరాబాద్‌లో మహా పాదయాత్ర నిర్వహించనున్నట్లు బీజేపీ ప్రకటించింది. ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ రాజకీయ లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించింది. ప్రజాస్వామ్య పరిరక్షణ, దేశ సమగ్రత, శాంతిభద్రతల అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ యాత్ర ప్రధాన లక్ష్యమని వెల్లడించింది. 'ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం.. అరాచకవాదాన్ని అంతం చేద్దాం' అనే నినాదంతో నవంబర్ 2 సాయంత్రం 4 గంటలకు ఈ పాదయాత్ర ప్రారంభం కానుంది. ట్యాంక్‌బండ్‌పై ఉన్న స్వామి వివేకానంద విగ్రహం నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు యాత్ర కొనసాగుతుంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ పాదయాత్రలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, శాసనమండలి పక్ష నేత ఏవీఎన్ రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు సహా పలువురు పార్టీ నేతలు పాల్గొననున్నారు. కాంగ్రెస్, ఇండీ కూటమి తమ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో అపోహలు సృష్టిస్తోందని బీజేపీ ఆరోపించింది. ఈ తప్పుడు ప్రచారాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగట్టి వాస్తవాలను వివరించడమే మహా పాదయాత్ర ఉద్దేశమని తెలిపింది. పార్టీ శ్రేణులు, మేధావులు, జాతీయవాదులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది.

# ఇంట్లో లేకుంటే ఓటు తీసేస్తారా?

- ఈసీ తీరుపై సుప్రీంకోర్టు సీరియస్
- అడ్రస్ మారితే కొత్తగా నమోదు చేసుకోవాలా?
- ఫారం-8 అవకాశం ఎందుకు ఇవ్వరని ప్రశ్న
- ఓటర్ల అభ్యంతరాల గడువు పెంచుతామన్న ఈసీ



**న్యూఢిల్లీ, అక్టోబర్ 28 (ఉద్యమ కెరటం):** ఢిల్లీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై దాఖలైన పిటిషన్ల విచారణలో సుప్రీంకోర్టు ఎన్నికల సంఘం (ఈసీ) తీరుపై కీలక ప్రశ్నలు సంధించింది. ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి సుమారు 47.57 లక్షల మంది పేర్లను తొలగించే విషయంలో తగిన విచక్షణతో వ్యవహరించిందా అని ప్రశ్నించింది. ఇప్పటికే ఓటర్ల జాబితాలో పేర్లు ఉండి, నివాసం మార్చుకున్నవారు కొత్త ఓటర్లుగా ఫారం-6 ఎందుకు సమర్పించాల్సి వస్తోందో వివరించాలని ఆదేశించింది. చిరునామా మార్పు కోసం ఉన్న ఫారం-8ను ఉపయోగించుకునే అవకాశం కల్పించాలని సూచించింది.

### డిసెంబర్ 4న తుది జాబితా..

ఢిల్లీలో ఆగస్టు 31న విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో.. అందుబాటులో లేనివారు, నివాసం మార్చుకున్నవారు, మరణించినవారు, ఒకటి కంటే ఎక్కువసార్లు పేర్లు ఉన్నవారిని చూపుతూ 47.57 లక్షల ఓట్లను తొలగించారు. అక్టోబర్ 26 నాటికి మ్యాపింగ్ సమస్యలకు సంబంధించి జారీ చేసిన 33.14 లక్షల నోటీసుల్లో 31.26 లక్షల కేసులను పరిష్కరించినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఫారం-6 కింద 2.67 లక్షల దరఖాస్తులు, ఫారం-7 కింద 20,074 అభ్యంతరాలు, ఫారం-8 కింద 1.01 లక్షల దరఖాస్తులు అందాయని కోర్టుకు వివరించింది. తుది ఓటర్ల జాబితాను డిసెంబర్ 4న విడుదల చేయాలని నిర్ణయించామని, అభ్యంతరాల గడువును పొడిగిస్తామని ఈసీ హామీ ఇచ్చింది.

### ఇంట్లో లేని వారి పరిస్థితి ఏంటి?

బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఎన్యూమరేషన్ ఫారాలు అందించే సమయంలో ఇంట్లో లేని ఓటర్ల పరిస్థితిపై ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. నిర్ణీత గడువులో ఫారం సమర్పించలేదన్న కారణంతో ఓటు హక్కు నిరాకరించడం సమంజసం కాదని వ్యాఖ్యానించింది. ఫారం అందని వారు, నివాసం మార్చుకున్నవారు తమ పేర్లను తిరిగి చేర్చుకునే అవకాశం కల్పించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సూచించింది. గడువులోగా ఫారాలు సమర్పించలేకపోయిన ఓటర్ల నుంచి అందుకు గల కారణాలను తెలుసుకునే మార్గాలను పరిశీలించాలని ఈసీని ఆదేశించింది.

# ఏఐతో ఆదా అయ్యే సమయం ప్రజల కోసమే!

**ప్రభుత్వ పాలనలో కృత్రిమ మేధతో వేగవంతమైన సేవలు**

**'ఏఐ సాక్షమ' ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, అక్టోబర్ 28 (ఉద్యమ కెరటం):** కృత్రిమ మేధస్సు (ఏఐ) వాడకంతో ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు వేగవంతం కావాలని, తద్వారా ఆదా అయ్యే ప్రతి గంటను ప్రజల కోసమే వెచ్చించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఏఐ టెక్నాలజీతో సమస్యలు సకాలంలో పరిష్కారమై రైతులు, సామాన్యులు ఆఫీసుల చుట్టూ తిరిగే పరిస్థితి మారాలన్నారు. హైదరాబాద్ ఎంసీఆర్ హెచ్ఆర్డీలో ప్రణాళికా శాఖ సహకారంతో టీజీ మ్యాథ్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన 'ఏఐ సాక్షమ' ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. సాంకేతికత ఎంత అధునాతనమైనదన్నది ముఖ్యం కాదని, ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తేగలిగినప్పుడే ఏఐ వినియోగానికి అసలైన సార్థకత అని ఆయన పేర్కొన్నారు. ఆర్థిక శాఖలో ప్రజాధనం సరైన లక్ష్యాలకు చేరుతోందా, ప్రాజెక్టుల అమలులో ఏమైనా లోపాలు ఉన్నాయా అన్నది గుర్తించేందుకు ఏఐ సాధనాలు ఎంతగానో దోహదపడతాయని డిప్యూటీ సీఎం తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరుతున్నాయా లేదా అన్నది ఏఐ విశ్లేషణతో పక్కాగా తెలుసుకోవచ్చన్నారు. అయితే, కేవలం గణాంకాల సగటులు మాత్రమే వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించవని, క్షేత్రస్థాయి పర్యటనలు, ఉద్యోగుల అనుభవానికి ఎప్పుడూ ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. ఒక వ్యవస్థ అసాధారణ ధోరణిని గుర్తించినంత మాత్రాన అది అక్రమాలకు రుజువు కాదని, నిబంధనలు, ఆధారాలతో పరిశీలించాల్సిందేనని తేల్చిచెప్పారు.



### విద్యుత్ రంగంలో మెరుగైన సేవలు..

విద్యుత్ డిమాండ్‌ను ముందుగానే అంచనా వేయడం, లోపాలను గుర్తించడం, నిర్వహణ చర్యలను మెరుగుపరచడంలో ఏఐ ఉపయోగపడుతుందని భట్టి తెలిపారు. రైతులు, ఆసుపత్రులు, చిన్న పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడంలో ఈ సాంకేతికత కీలకమన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల గుర్తింపు, నివేదికల రూపకల్పన తదితర పనుల్లో ఏఐతో సమయం ఆదా అవుతుందని, ఆ సమయాన్ని క్లిష్టమైన కేసుల పరిష్కారానికి వాడాలని సూచించారు. ఏఐ ఎంత స్పష్టమైన సమాచారం ఇచ్చినా.. పేర్లు, అర్హతలు, నిబంధనలను అధికారులు విధిగా తమ స్థాయిలో ధ్రువీకరించుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి ప్రజలు అందించే వ్యక్తిగత సమాచారాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించాలని, అనుమతి లేని ఏఐ సాధనాల్లో అధికారిక సమాచారాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ నమోదు చేయరాదని భట్టి ఆదేశించారు. ఏఐ రూపొందించిన సమాచారాన్ని రికార్డుల్లో చేర్చేముందు తప్పనిసరిగా సరిచూసుకోవాలన్నారు. ఏఐ ఆధారంగా తీసుకునే నిర్ణయాల్లోనూ మానవ పర్యవేక్షణ ఉండాలని, పౌరులు అధికారులను సంప్రదించే అవకాశం కల్పించాలన్నారు. ప్రతి శాఖలో చిన్నస్థాయి ప్రయోగాలతో మొదలుపెట్టి కచ్చితత్వం అంచనా వేశాకే వాటిని విస్తరించాలని సూచించారు. ఉద్యోగుల్లో ఆత్మవిశ్వాసం పెంచేందుకు 'ఏఐ సాక్షమ' ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, ఎంసీఆర్ హెచ్ఆర్డీ డీజీ శాంతికుమారి, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, టీజీ మ్యాథ్ ఎండీ పూజ తదితరులు పాల్గొన్నారు.



# వలసలు నివారించండి!

**ఎల్‌నినో నేపథ్యంలో గ్రామస్థాయిలో ముందస్తు చర్యలు**

**ఉపాధి పనులతో నిరంతర పని కల్పించాలి**

**నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణకు పెద్దపీట**

**వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క ఆదేశాలు**

**హైదరాబాద్, అక్టోబర్ 28 (ఉద్యమ కెరటం):** ఎల్‌నినో వల్ల ఏర్పడే వర్షాభావ, కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు గ్రామస్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయడంతోపాటు నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పెంపునకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. బీఆర్కే భవన్ నుంచి బుధవారం సుమారు 12 వేల మంది సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ఆ శాఖ రూపొందించిన జలసిరి వీడియోను మంత్రి ఆవిష్కరించారు. రాష్ట్రంలోని 12,516 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు ప్రారంభమయ్యాయని, మిగిలిన 244 పంచాయతీల్లోనూ వెంటనే మొదలుపెట్టాలని మంత్రి ఆదేశించారు. గ్రామాల్లో కూలీలకు నిరంతరంగా పనులు కల్పించి, వలసలను నివారించాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఐటీడీఏ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కూలీలకు ఉపాధి కల్పించాలన్నారు.

### నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యం..

ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఇంకుడు గుంతలు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టాలని మంత్రి సూచించారు. పశువులకు మేత, తాగునీటి కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. ఉపాధి పనుల ద్వారా వచ్చే నిధులతో వర్క్‌షెడ్లు, పశువుల షెడ్లు, కమ్యూనిటీ హాళ్లు నిర్మించుకోవచ్చన్నారు. 15 రోజుల్లో పనుల బిల్లులు వస్తాయని, ఒక్కో గ్రామానికి రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు నిధులు సమకూరే అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇందిరా గాంధీ జయంతి (నవంబర్ 19) నాటికి గ్రామ మహిళా సంఘ భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ఆదర్శ గ్రామాలుగా అభివృద్ధి చేస్తే కేంద్రం నుంచి అవార్డులు, అదనపు నిధులు వస్తాయని గుర్తుచేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, సెర్ప్ కమిషనర్ దివ్య దేవరాజన్ సహా పలు జిల్లాల అదనపు కలెక్టర్లు, ఐటీడీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు. కాగా, గవర్నర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా తిరిగి నియమితులైన దాన కిషోర్‌ను మంత్రి సీతక్క ఈ సందర్భంగా సత్కరించారు.

# కరువు జాబితాలో కరీంనగర్‌కు అన్యాయం!

**అర్హత ఉన్న మండలాలకు దక్కని చోటు**

**కరువు ఎంపిక అశాస్త్రీయమన్న బండి సంజయ్**

**ప్రమాణాలు, గణాంకాలు వెల్లడించాలని డిమాండ్**



**హైదరాబాద్, అక్టోబర్ 28 (ఉద్యమ కెరటం):** తెలంగాణలో కరువు మండలాల ఎంపికపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యధిక లోటు వర్షపాతం నమోదైన అనేక మండలాలను జాబితాలో చేర్చకుండా ప్రభుత్వం మొక్కుబడిగా ప్రకటన చేసిందని విమర్శించారు. మండలాల ఎంపిక అశాస్త్రీయంగా ఉందని, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొంటూ ఆయన తాజాగా పత్రికా ప్రకటన విడుదల చేశారు. 35 శాతం వర్షపాతం లోటు ఉన్న మండలాలు సైతం కరువు జాబితాలో లేకపోవడం బాధాకరమని బండి సంజయ్ అన్నారు. హుస్నాబాద్, వేములవాడ, సిరిసిల్ల, మానకొండూరు, చొప్పదండి నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నా ప్రభుత్వం గుర్తించలేదని మండిపడ్డారు. పొలాలు బీళ్లుగా మారి తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదురవుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడితే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయన్నారు. కరువు మండలాల ఎంపికకు అనుసరించిన ప్రమాణాలు, అధికారిక గణాంకాలను ప్రభుత్వం తక్షణమే బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి మండలంలోని వర్షపాతం లోటు, సాగు విస్తీర్ణం, పంటల పరిస్థితి, భూగర్భ జలాల వివరాలను వెల్లడించాలని కోరారు. రాష్ట్ర సగటు వర్షపాతం ఆధారంగా కాకుండా ప్రతి మండల పరిస్థితిని విడివిడిగా పరిశీలించాలని స్పష్టం చేశారు. అర్హత ఉన్న మండలాలను కరువు జాబితాలో చేర్చి, ప్రభావిత రైతులకు సహాయం అందించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# ఉద్యోగులకు కేంద్ర కేబినెట్ తీపికబురు!

**డీఏ, డీఆర్ కోసం రూ.10,016 కోట్లు కేటాయింపు**

**నాలుగు కీలక నిర్ణయాలకు కేంద్రం ఆమోదం**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 28 (ఉద్యమ కెరటం):** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కరువు భత్యం (డీఏ), కరువు సహాయ భత్యం (డీఆర్) కోసం కేంద్ర కేబినెట్ ఏకంగా రూ.10,016 కోట్లు కేటాయించింది. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన ఈ భత్యాల కోసం ఈ నిధులను కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే, డీఏ, డీఆర్‌లను ఎంత శాతం మేర పెంచారనే పూర్తి వివరాలను మాత్రం ప్రభుత్వం ఈ సందర్భంగా వెల్లడించలేదు. దేశీయ తయారీ రంగాన్ని ప్రోత్సహించడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని వేగవంతం చేయడం లక్ష్యంగా మరో మూడు కీలక నిర్ణయాలకు కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. డీఏ నిధులతో కలిపి ఈ నాలుగు నిర్ణయాల కోసం మొత్తం రూ.29,267 కోట్లను కేటాయించినట్లు ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. దేశంలో కంటైనర్ల ఉత్పత్తిని పెంచడంతో పాటు తయారీ కార్యకలాపాలను విస్తరించాలని కేంద్రం నిర్ణయించింది. స్వదేశీ తయారీ రంగానికి ఊతమిచ్చేందుకు వీలుగా కంటైనర్ తయారీకి రూ.10,000 కోట్లతో ఒక ప్రత్యేక పథకాన్ని తీసుకురావడానికి కేబినెట్ పచ్చజెండా ఊపింది.

### క్రీడలు, గ్రామీణాభివృద్ధికి పెద్దపీట..

దేశంలో క్రీడా వస్తువుల తయారీ పరిశ్రమ అభివృద్ధి కోసం కేంద్రం కొత్త పథకాన్ని ఆమోదించింది. 'ఖేలో ఇండియా స్పోర్ట్స్ గూడ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్' పేరుతో రూ.1,856 కోట్లు కేటాయించింది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు 'ప్రధానమంత్రి వికసిత్ గ్రామ స్వరాజ్ యోజన'కు రూ.7,395 కోట్లు మంజూరు చేసింది. కేంద్ర కేబినెట్ తీసుకున్న ఈ నిర్ణయాలతో దేశంలో తయారీ రంగంతో పాటు గ్రామీణాభివృద్ధికి భారీగా ప్రోత్సాహం లభించనుంది.

# ధర్నా చౌక్ ఎత్తేసిన ఘనత మీదే కదా!

**ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు బీఆర్ఎస్‌కు లేదు**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**హైదరాబాద్, అక్టోబర్ 28 (ఉద్యమ కెరటం):** ఇందిరా పార్కు వద్ద ధర్నా చౌక్‌ను ఎత్తివేసి నిరసన గొంతులను నొక్కేసిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే ధర్నా చౌక్‌ను పునరుద్ధరించి ప్రజలకు స్వేచ్ఛగా నిరసన తెలిపే హక్కు కల్పించామని గుర్తు చేశారు. బుధవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ప్రతిపక్షాల తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీలో విపక్షాల నిరసనలకు ఆటంకాలు కల్పిస్తున్న బీజేపీ నాయకులు.. ఇక్కడ అమిత్ షా పాదయాత్ర చేయడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని పొంగులేటి విమర్శించారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం నవంబర్ 1న ఢిల్లీలో ఇండి కూటమి తలపెట్టిన ర్యాలీకి, ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ప్రత్యేక రైళ్లు కేటాయించకపోవడం దారుణమన్నారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా నుంచి అర్హుల పేర్లను తొలగిస్తున్నారని, ఇందుకు బాధ్యుడైన ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

### నిరాడంబరంగా పుట్టినరోజు..

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో మంత్రి పొంగులేటి బుధవారం తన పుట్టినరోజు వేడుకలను అత్యంత నిరాడంబరంగా జరుపుకున్నారు. ఉదయం సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలవగా, ఆయన శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా ఆర్భాటాలకు దూరంగా ఉండాలని మంత్రి తన అభిమానులకు పిలుపునిచ్చి ఆదర్శంగా నిలిచారు.

## సంపాదకీయం



# రైళ్లలో రాత్రిపూట మొబైల్ ఛార్జింగ్ బంద్!

**రాత్రి 11 నుంచి ఉదయం 5 గంటల వరకు ఛార్జింగ్ పాయింట్ల నిలిపివేత**

**ప్రయాణికుల భద్రత కోసం రైల్వే బోర్డు కీలక ఆదేశాలు**

**ముంబయి లోకల్ రైలులో పవర్ బ్యాంక్ పేలుడు నేపథ్యంలో అప్రమత్తం**

**అన్ని రైల్వే జోన్లలో నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని సూచన**

**నిర్లక్ష్యం చేస్తే చర్యలు.. ఆకస్మిక తనిఖీలకు ఆదేశాలు**

రైళ్లలో రాత్రివేళ మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లకు ఛార్జింగ్ పెట్టుకునే ప్రయాణికులు ఇకపై అప్రమత్తంగా ఉండాల్సిందే. అగ్నిప్రమాదాల నివారణ, ప్రయాణికుల భద్రత దృష్ట్యా రైల్వే బోర్డు కీలక ఆదేశాలు జారీ చేసింది. రాత్రి 11 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 5 గంటల వరకు రైళ్లలోని ఛార్జింగ్ పాయింట్లకు విద్యుత్ సరఫరాను నిలిపివేయాలని అన్ని రైల్వే జోన్లను ఆదేశించింది. ఈ నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని, ఎక్కడా నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేసింది. దీంతో రాత్రివేళ రైళ్లలో ప్రయాణించే వారు తమ మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ముందుగానే ఛార్జింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. ఇటీవల ముంబయి లోకల్ రైలులో ఓ ప్రయాణికుడు ఛార్జింగ్ చేస్తున్న సమయంలో పవర్ బ్యాంక్ పేలిపోయిన ఘటన కలకలం రేపింది. పేలుడు కారణంగా రైలు బోగీ మొత్తం దట్టమైన పొగతో నిండిపోయింది. ఈ ఘటన నేపథ్యంలో రైళ్లలో విద్యుత్ పరికరాల వినియోగం, ఛార్జింగ్ భద్రతపై రైల్వే అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే రాత్రివేళ ఛార్జింగ్ పాయింట్లను నిలిపివేసే నిబంధనను కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. రాత్రివేళ ప్రయాణికులు గాఢ నిద్రలో ఉండే సమయంలో మొబైల్ ఫోన్లు, పవర్ బ్యాంకులు, ల్యాప్‌టాప్‌లు ఎక్కువసేపు ఛార్జింగ్‌లో ఉండటం ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని రైల్వే అధికారులు భావిస్తున్నారు. పరికరాలు అధికంగా వేడెక్కడం, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వంటి సమస్యలు తలెత్తితే వెంటనే గుర్తించడం కష్టమవుతుంది. ముఖ్యంగా రాత్రి సమయంలో చిన్నపాటి మంటలు చెలరేగినా ప్రయాణికులు అప్రమత్తమయ్యేలోపు ప్రమాదం తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది. అందువల్లే రాత్రి ఆరు గంటలపాటు ఛార్జింగ్ సదుపాయాన్ని నిలిపివేయాలని నిర్ణయించారు. రైల్వే బోర్డు ఆదేశాల ప్రకారం రాత్రి 11 గంటలకు కోచ్‌లలోని ఛార్జింగ్ పాయింట్లకు విద్యుత్ సరఫరాను నిలిపివేసి, ఉదయం 5 గంటల తర్వాత తిరిగి అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి రైల్వే సిబ్బందికి తగిన శిక్షణ ఇవ్వాలని సూచించారు. నిబంధనలు సక్రమంగా అమలవుతున్నాయో లేదో తెలుసుకునేందుకు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. రైళ్లలో రాత్రిపూట ఛార్జింగ్‌పై ఆంక్షలు విధించడం ఇదే తొలిసారి కాదు. అగ్నిప్రమాదాల నివారణలో భాగంగా 2014లోనే ఈ తరహా భద్రతా నిబంధనలను ప్రవేశపెట్టారు. అయితే వాటి అమలులో లోపాలు ఉన్నట్లు గుర్తించిన నేపథ్యంలో తాజా ఘటనతో మరోసారి కట్టుదిట్టమైన చర్యలకు రైల్వే బోర్డు సిద్ధమైంది. రాత్రివేళ ప్రయాణించే వారు ముందుగానే తమ పరికరాలను ఛార్జింగ్ చేసుకోవాలని, రైళ్లలో భద్రతా నిబంధనలను పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

# బ్యాలెట్‌తో ఎన్నికలు..

- కాంగ్రెస్‌కు సీట్లు ఎన్నో చెప్పండి!
- కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రాలు
- నాలుగు రాష్ట్రాల్లో 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు
- బ్యాలెట్ పత్రాలతోనే పోలింగ్.. అయినా ఫలితాలపై చురకలు
- కర్ణాటకలో అధికార కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బ
- నాలుగు స్థానాల్లోనూ ఓటమి.. బీజేపీకి మూడు, జేడీఎస్‌కు ఒక స్థానం



**న్యూఢిల్లీ, అక్టోబర్ 28 :** ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు బదులుగా బ్యాలెట్ పత్రాలను ఉపయోగించాలంటూ డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నాలుగు రాష్ట్రాల్లో జరిగిన శాసనమండలి ఎన్నికల్లో కాంగ్రెస్ పేలవ ప్రదర్శనను ప్రస్తావిస్తూ ఆ పార్టీని ఎద్దేవా చేశారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, కర్ణాటక రాష్ట్రాల్లో మొత్తం 28 ఎమ్మెల్సీ స్థానాలకు బ్యాలెట్ పత్రాలతోనే ఎన్నికలు నిర్వహించారని గుర్తుచేశారు. మరి ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎన్ని స్థానాలు గెలుచుకుందో చెప్పాలంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. బ్యాలెట్ విధానాన్ని సమర్థిస్తున్న కాంగ్రెస్‌కు తాజా ఫలితాలు ఏం చెబుతున్నాయంటూ పరోక్షంగా చురకలంటించారు. ప్రధాని వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. దేశంలో ఎన్నికల నిర్వహణ, ఓటింగ్ యంత్రాల విశ్వసనీయతపై ప్రతిపక్షాలు తరచూ ప్రశ్నలు లేవనెత్తుతున్న నేపథ్యంలో ప్రధాని మోదీ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నాలుగు పెద్ద రాష్ట్రాల్లో జరిగిన శాసనమండలి ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను ఉపయోగించలేదని, బ్యాలెట్ పత్రాలతోనే పోలింగ్ నిర్వహించారని ఆయన ప్రస్తావించారు. అయినప్పటికీ కాంగ్రెస్ ఆశించిన ఫలితాలు సాధించలేకపోయిందనే అంశాన్ని ఎత్తిచూపారు. ఎన్నికల ఓటములకు ఓటింగ్ విధానాన్ని కారణంగా చూపుతున్నారనే విమర్శలకు తన వ్యాఖ్యల ద్వారా మోదీ మరింత పదును పెట్టినట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకలో శాసనమండలి ఎన్నికల ఫలితాలు ఆ పార్టీకి గట్టి ఎదురుదెబ్బగా మారాయి. రెండు ఉపాధ్యాయ, రెండు పట్టభద్రుల నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయింది. మొత్తం నాలుగు స్థానాల్లోనూ ఓటమి చవిచూసింది. బీజేపీ మూడు స్థానాలను నిలబెట్టుకోగా, జనతాదళ్ సెక్యులర్ ఒక స్థానాన్ని కైవసం చేసుకుంది. అధికారంలో ఉన్నప్పటికీ శాసనమండలి ఎన్నికల్లో కాంగ్రెస్ ఖాతా తెరవలేకపోవడం రాజకీయంగా చర్చకు దారితీసింది. ఉత్తరప్రదేశ్‌లో ఆరు ఉపాధ్యాయ, ఐదు పట్టభద్రుల నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగాయి. అందుబాటులో ఉన్న ఫలితాల ప్రకారం బీజేపీ ఐదు స్థానాల్లో విజయం సాధించగా, సమాజ్‌వాదీ పార్టీ మూడు స్థానాలను కైవసం చేసుకుంది. మిగిలిన స్థానాలకు సంబంధించిన పూర్తిస్థాయి ఫలితాలు వెలువడాల్సి ఉంది. మహారాష్ట్రలో రెండు ఉపాధ్యాయ, మూడు పట్టభద్రుల నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించారు. ఓట్ల లెక్కింపులో బీజేపీ నేతృత్వంలోని అధికార మహాయుతి కూటమి మూడు స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా, ప్రతిపక్ష ఎన్సీపీ శరద్ పవార్ వర్గం రెండు స్థానాల్లో ముందంజలో ఉన్నట్లు సమాచారం. తుది ఫలితాల అనంతరం రాజకీయ సమీకరణాలపై మరింత స్పష్టత రానుంది. బిహార్‌లో నాలుగు ఉపాధ్యాయ, నాలుగు పట్టభద్రుల నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక స్థానాన్ని జన్‌సురాజ్ పార్టీ కైవసం చేసుకుంది. బీజేపీ, జేడీయూ, ఆర్జేడీ, స్వతంత్ర అభ్యర్థి ఒక్కో స్థానంలో విజయం సాధించినట్లు అందుబాటులో ఉన్న ఫలితాలు వెల్లడిస్తున్నాయి. మిగిలిన స్థానాల్లో ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది.

### రాజకీయ దుమారం రేపిన ప్రధాని వ్యాఖ్యలు

నాలుగు రాష్ట్రాల్లోని 28 శాసనమండలి స్థానాలకు ఈ నెల 23న జరిగిన ఎన్నికల ఫలితాలను ఆధారంగా చేసుకుని కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ విమర్శలు గుప్పించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించినప్పటికీ కాంగ్రెస్ ఆశించిన విజయాలు సాధించలేకపోయిందనే అంశాన్ని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. అయితే పూర్తిస్థాయి ఫలితాలు ఇంకా వెలువడాల్సి ఉండటంతో అన్ని రాష్ట్రాల్లో పార్టీల తుది బలాబలాలపై స్పష్టత రావాల్సి ఉంది.

# పాక్‌కు భారత్ ఆహ్వానం!

## ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి..

- 18 నెలల తర్వాత భారత్--పాకిస్థాన్ సంబంధాల్లో కీలక పరిణామం
- ఢిల్లీలో షాంఘై సహకార సంస్థ సాంస్కృతిక సదస్సు
- పాక్ సాంస్కృతిక శాఖ మంత్రి ఔరంగజేబ్ ఖాన్‌కు ఆహ్వానం
- నవంబర్ 20 నుంచి 22 వరకు మూడు రోజులపాటు సమావేశాలు
- పాక్ మంత్రి హాజరైతే మూడేళ్ల తర్వాత భారత్‌లో తొలి ఉన్నతస్థాయి పర్యటన



**న్యూఢిల్లీ, అక్టోబర్ 28:** పహల్గాం ఉగ్రదాడి.. ఆ తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసిన భారత్-పాకిస్థాన్ సంబంధాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. దాదాపు 18 నెలల తర్వాత భారత్ నుంచి పాకిస్థాన్‌కు అధికారిక ఆహ్వానం వెళ్లింది. షాంఘై సహకార సంస్థ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించనున్న నాగరికతల సంభాషణ వేదిక సదస్సులో పాల్గొనాలని పాకిస్థాన్‌ను భారత్ ఆహ్వానించింది. దేశ రాజధాని ఢిల్లీలో నవంబర్ 20 నుంచి 22 వరకు ఈ సదస్సు జరగనుంది. ఇందులో పాల్గొనేందుకు పాకిస్థాన్ సాంస్కృతిక శాఖ మంత్రి ఔరంగజేబ్ ఖాన్‌కు ఆహ్వానం పంపినట్లు సమాచారం. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు సంక్లిష్టంగా ఉన్న సమయంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. గతేడాది పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి అనంతరం భారత్-పాకిస్థాన్ మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. అప్పటి నుంచి ద్వైపాక్షిక సంబంధాల్లో ప్రతిష్టంభన కొనసాగుతున్న నేపథ్యంలో పాకిస్థాన్ మంత్రికి భారత్ నుంచి ఆహ్వానం వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఇది ద్వైపాక్షిక చర్చల కోసం పంపిన ప్రత్యేక ఆహ్వానం కాకుండా, షాంఘై సహకార సంస్థ సభ్యదేశాలన్నింటికీ పంపిన ఆహ్వానంలో భాగమని తెలుస్తోంది. ఈ సదస్సుకు పాకిస్థాన్ సాంస్కృతిక శాఖ మంత్రి ఔరంగజేబ్ ఖాన్ హాజరైతే మూడేళ్ల తర్వాత ఆ దేశానికి చెందిన సీనియర్ మంత్రి భారత్‌లో పర్యటించినట్లవుతుంది. చివరిసారిగా 2023లో గోవాలో జరిగిన షాంఘై సహకార సంస్థ విదేశాంగ మంత్రుల సమావేశానికి అప్పటి పాకిస్థాన్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో జర్దారీ హాజరయ్యారు. ఆ తర్వాత ఇరు దేశాల మధ్య ఉన్నతస్థాయి ప్రత్యక్ష సమావేశాలు పరిమితమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజా ఆహ్వానాన్ని పాకిస్థాన్ అంగీకరిస్తుందా, మంత్రి స్వయంగా హాజరవుతారా అన్నది ఆసక్తికరంగా మారింది. షాంఘై సహకార సంస్థలోని పది సభ్యదేశాలన్నింటినీ నాగరికతల సంభాషణ సదస్సుకు ఆహ్వానించినట్లు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అక్టోబర్ 20న వెల్లడించారు. తజికిస్థాన్‌లో జరిగిన సంస్థ ప్రభుత్వాధినేతల మండలి సమావేశం సందర్భంగా ఆయన ఈ విషయాన్ని ప్రకటించారు. సభ్యదేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేయడం, నాగరికతల మధ్య పరస్పర అవగాహన పెంపొందించడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. షాంఘై సహకార సంస్థ ఆధ్వర్యంలో ఇలాంటి వేదికను నిర్వహించడం ఇదే తొలిసారి. షాంఘై సహకార సంస్థలో భారత్, పాకిస్థాన్‌తోపాటు చైనా, రష్యా, కజకిస్థాన్, కిర్గిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, ఇరాన్, బెలారస్ సభ్యదేశాలుగా ఉన్నాయి. ఈ దేశాల మధ్య చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఢిల్లీ సదస్సును నిర్వహించనున్నారు. రాజకీయ విభేదాలకు అతీతంగా సభ్యదేశాల మధ్య సాంస్కృతిక సహకారాన్ని ప్రోత్సహించడం ఈ సమావేశాల ఉద్దేశం. పాకిస్థాన్‌కు భారత్ ఆహ్వానం పంపడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నప్పటికీ, దీనిని ఇరు దేశాల మధ్య సంబంధాల పునరుద్ధరణకు సంకేతంగా భావించడం తొందరపాటే అవుతుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. బహుళపక్ష వేదికలో భాగంగా పంపిన ఆహ్వానం కావడంతో ద్వైపాక్షిక సంబంధాల్లో మార్పు వస్తుందా లేదా అన్నది ఇప్పుడే చెప్పలేని పరిస్థితి. అయితే పాకిస్థాన్ మంత్రి ఢిల్లీ సదస్సుకు హాజరైతే ఆపరేషన్ సిందూర్ అనంతరం ఇరు దేశాల మధ్య చోటుచేసుకునే కీలక దౌత్య పరిణామాల్లో ఒకటిగా నిలిచే అవకాశం ఉంది. దీంతో నవంబర్‌లో జరగనున్న సదస్సుపై రాజకీయ, దౌత్య వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# వీడియో కాల్స్‌తో నేరాలు

## డిజిటల్ అరెస్టులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 28:** డిజిటల్ అరెస్టు పేరిట జరుగుతోన్న మోసాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సైబర్ నేరాలను డిజిటల్ దోపిడీగా అభివర్ణించింది. ఆ దోపిడీదారుల్ని నిర్దాక్షిణ్యంగా శిక్షించాలని, సైబర్ నేరగాళ్లపై ఉక్కుపాదం మోపాలని సర్వోన్నత న్యాయస్థానం అధికారులను ఆదేశించింది. డిజిటల్ మోసాలకు సంబంధించి దేశవ్యాప్తంగా తమపై నమోదైన ఎఫ్ఐఆర్‌లు అన్నింటినీ ఒకచోటకు చేర్చాలంటూ నిందితులు వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. నిందితుల సౌలభ్యం కోసం బాధితులను ఇబ్బంది పెట్టలేమని తేల్చి చెప్పింది. "మా అభిప్రాయం ప్రకారం.. డిజిటల్ అరెస్టులంటే డిజిటల్ దోపిడీనే. వీడియో కాల్స్ ద్వారా ఈ నేరాలకు పాల్పడుతున్నారు. వీరికి కఠిన శిక్షలు పడాల్సిందే. విచారణకు ముందే వారిని శిక్షించేందుకు చట్టంలో ఏదైనా అవకాశం ఉంటే దానిని ఉపయోగించాలి" అని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. కమీషన్ల కోసం నిందితులు తమ కంపెనీ బ్యాంకు ఖాతాలను మ్యూల్ అకౌంట్లు (సైబర్ నేరాల సొమ్మును దాచడానికి)గా వాడుకోవడానికి అనుమతించిన ఆరోపణలపై 12 రాష్ట్రాల్లో 30కిపైగా కేసులు నమోదయ్యాయి. ఆ కేసుల్నింటిని ఒకేచోటుకి చేర్చి విచారించాలని కోరుతూ నిందితులు నిధి భండారీ, గౌరబ్ సాహా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే అత్యున్నత న్యాయస్థానం వారి అభ్యర్థనను తోసిపుచ్చింది. "డిజిటల్ అరెస్టులతో పెద్దమొత్తంలో ప్రజలను మోసగిస్తోన్న నేరస్థులకు ఎలాంటి వెసులుబాట్లు ఇవ్వబోం. నిందితుల సౌలభ్యం కోసం బాధితులు లేక దర్యాప్తు సంస్థలు వేరే ప్రాంతాలకు వెళ్లేలా ఆదేశించలేం. బాధితుల హక్కులను విస్మరించి నిందితుల ప్రయోజనాలను కాపాడలేం" అని ధర్మాసనం స్పష్టం చేసింది. దోపిడీ సొమ్మును హాంకాంగ్, బ్యాంకాక్‌లో డిపాజిట్ చేస్తే.. పరిష్కారం కోసం బాధిత వ్యక్తిని అక్కడికి వెళ్లమని చెప్పలేం కదా..? అని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. దీంతో నిందితులు తమ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. వారిపై ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, తెలంగాణ, కేరళం సహా పలు రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయి.

# టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నారు

## రాహుల్ గాంధీ




**న్యూఢిల్లీ, అక్టోబర్ 28:** టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్‌లో ఛైర్మన్ నియామకంపై వివాదం కొనసాగుతున్న వేళ రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నారని.. దీని గురించి ఏ వ్యాపారి మాట్లాడే ధైర్యం చేయలేకపోతున్నారని పేర్కొన్నారు. టాటా గ్రూప్ సామాజిక నిబద్ధతను, యాజమాన్య విధానాలను పరిరక్షించాల్సిన అవసరముందన్నారు. 'టాటా గ్రూప్‌ను కుట్ర పూరితంగా నాశనం చేస్తున్నారు. ట్రస్ట్‌ను బలహీనపరిస్తే గ్రూప్ కంపెనీలు, వాటిపై ఆధారపడిన ఉద్యోగుల భవిష్యత్ ప్రమాదంలో పడుతుంది. ఇంత జరుగుతున్నా.. ఏ వ్యాపారవేత్త కూడా ఒక్క మాట మాట్లాడటానికి సాహసించట్లేదు. మీరు ఇంకెంతకాలం మౌనంగా ఉంటారు? వారు మిమ్మల్ని సొంతం చేసుకునేంత వరకా? భారతదేశంలో వ్యాపారం ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాల ఆటబొమ్మ కాదు. దీనిపై ప్రశ్నించేందుకు మీకు ధైర్యం లేదు. కానీ మాకు ఉంది. ఈ విషయంలో తగిన న్యాయం జరిగేలా చూస్తాం' అని రాహుల్ గాంధీ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఆయన ఆరోపణలపై ప్రభుత్వం గానీ.. టాటా గ్రూప్ గానీ స్పందించలేదు. ఇటీవల ఎన్.చంద్రశేఖరన్‌ను మరో ఐదేళ్ల కాలానికి ఛైర్మన్‌గా పునర్నియమిస్తూ టాటా సన్స్ బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఆ నిర్ణయం చట్టవిరుద్ధమని, చెల్లుబాటు కాదని ట్రస్ట్ వ్యతిరేకిస్తోంది. ఈక్రమంలోనే రాహుల్ గాంధీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# జడ్జి కుమారుడి హిట్ అండ్ రన్ కేసు

## పోలీసు కమిషనర్‌పై వేటు

**కొచ్చి, అక్టోబర్ 28 :** కేరళంలో జడ్జి కుమారుడి హిట్ అండ్ రన్ కేసు సంచలనంగా మారింది. ఈ కేసులో పోలీసుల దర్యాప్తులో అవకతవకలు చోటుచేసుకున్నట్లు విమర్శలు వస్తుండడంతో రాష్ట్ర ప్రభుత్వం కొచ్చి నగర పోలీస్ కమిషనర్ కళిరాజ్ మహేశ్ కుమార్‌ను బదిలీ చేసింది. ఈ కేసు దర్యాప్తులో పలు లోపాలు ఉన్నట్లు గుర్తించామని.. అందుకే ఈ చర్యలు తీసుకున్నామని హోం మంత్రి రమేశ్ చెన్నితాల పేర్కొన్నారు. ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, స్టేషన్ హౌస్ ఆఫీసర్, గ్రేడ్ సబ్-ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ సివిల్ పోలీస్ ఆఫీసర్‌లనూ సస్పెండ్ చేశామన్నారు. హిట్ అండ్ రన్ కేసులో నిందితుడు జడ్జి కుమారుడు కావడంతో అతడిని కాపాడడానికి పోలీసులు కుట్ర పన్నారని మృతుడి కుటుంబం ఆరోపించింది. వివిధ కారణాలను సాకుగా చూపి.. మైనర్ అయిన నిందితుడికి కొన్ని గంటల్లోనే రెండు సార్లు బెయిల్ మంజూరు చేశారని తెలిపింది. ఈ వ్యవహారంపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేయడంతో అసెంబ్లీలో రాజకీయ వివాదానికి దారితీసింది. మైనర్ అయిన వ్యక్తి నేరానికి పాల్పడినప్పుడు అతడి సంరక్షకుడిపై కానీ, నడుపుతున్న వాహనం యజమానిగా రిజిస్టర్ అయిన వ్యక్తిపై కానీ కేసు నమోదు చేయాలనే రూల్ ప్రకారం..ఈ కేసులో న్యాయమూర్తిని నిందితుడిగా చేర్చేందుకు కేరళం హైకోర్టు సోమవారం అనుమతిచ్చింది. దీంతో మంగళవారం జడ్జి నివాసంలో పోలీసులు సోదాలు నిర్వహించారు.



# పత్తి పంట ధ్వంసం చేసిన అటవీ జంతువులు

• ఒకటిన్నర ఎకరాల్లో పంటకు నష్టం.. పరిహారం చెల్లించాలని రైతు వేడుకోలు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన రైతు రాథోడ్ సందీప్ తనకున్న మూడు ఎకరాల 68 గుంటల వ్యవసాయ భూమిలో పత్తి పంటను సాగు చేశాడు. ఎంతో కష్టపడి పండించిన పంటను అటవీ జంతువుల బారి నుంచి కాపాడుకునేందుకు పగలు, రాత్రి తేడా లేకుండా కాపలా కాస్తున్నాడు. రైతు లేని సమయంలో అటవీ జంతువులు పత్తి చేనులోకి చొరబడి సుమారు ఒకటిన్నర ఎకరాల పంటను ధ్వంసం చేశాయి. దీంతో రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది. పంటపై ఆధారపడి జీవిస్తున్న తమ కుటుంబానికి ఈ నష్టం భారంగా మారిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. సంబంధిత అటవీ శాఖ అధికారులు స్పందించి పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టపరిహారం అందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని రైతు అధికారులను వేడుకుంటున్నాడు.

# రూ.11 లక్షలతో శ్మశానవాటిక అభివృద్ధి పనులు



**ఉద్యమ కెరటం, జవహర్ నగర్:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చంద్రపురి కాలనీ డివిజన్, వెంకటేశ్వర కాలనీలో ఉన్న హిందూ శ్మశానవాటికలో రూ.11 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు చంద్రపురి కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వర కాలనీ శ్మశానవాటికను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించడంతో పాటు, శ్మశానవాటికలో అభివృద్ధి పనులను దశలవారీగా చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ బింగి లావణ్య సతీష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ గొడుగు వేణు, సీనియర్ నాయకులు మందుల రజిత గోపాల్, కారింగుల రాజు గౌడ్, ఉపాధ్యక్షుడు చిట్టి బాబు, ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్, జోగి సునీత, మాధవరెడ్డి, కోశాధికారి అశోక్ గుప్తా, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాహుల్ కదం, నాయకులు సాయికృష్ణ, బబ్లూ ముదిరాజ్, భాస్కర్ గౌడ్, కిషోర్, మంజుల, రవి, శ్రీరామ్, ఇరగ దిండ్ల రాజు, నిర్వాహకులు యాదయ్య, యాదగిరి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

# కిష్టంపేట గ్రామ పంచాయతీలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ




**ఉద్యమ కెరటం, తాండూర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం మండలంలోని కిష్టంపేట గ్రామపంచాయతీలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిష్టంపేట గ్రామ సర్పంచ్ సార్ల తిరుపతి, ఉప సర్పంచ్ అనుమండ్ల విక్రమ్, బెల్లంపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కామని శ్రీనివాస్, వార్డు సభ్యులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐసీసీ అబ్జర్వర్ మరియప్పన్‌కు సాజిద్ ఖాన్ సన్మానం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఏఐసీసీ అబ్జర్వర్ మరియప్పన్ ను జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ బుధవారం ఆయన నివాసంలో ఘనంగా సన్మానం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియప్పన్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, సంస్థాగత వ్యవహారాలపై నాయకులు చర్చించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం వంటి అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ శ్రావణ్ రావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్ జాదవ్, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు దుర్గం శేఖర్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతన్ రావు, వార్డు ప్రెసిడెంట్ శ్యామ్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీలు ప్రారంభం

• మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకల్లో భాగంగా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే




**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సత్తుపల్లి పట్టణంలోని రాణీ సెలబ్రేషన్ ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్న 73వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల కబడ్డీ పోటీలను బుధవారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. అక్టోబర్ 28, 29, 30 తేదీల్లో మూడు రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీలను సత్తుపల్లిలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పోటీల నిర్వహణకు చేసిన ఏర్పాట్లు, క్రీడాకారిణులకు కల్పించిన వసతి సౌకర్యాలు బాగున్నాయని అభినందించారు. ఈ పోటీల ద్వారా సత్తుపల్లి ఖ్యాతి రాష్ట్ర వ్యాప్తంగా మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. మహిళా క్రీడాకారిణులను ప్రోత్సహించడం, వారి ప్రతిభను వెలికితీయడం, క్రీడారంగంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవకాశాలు కల్పించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారిణులందరూ క్రీడాస్ఫూర్తితో ఆడి ప్రతిభను చాటుకోవాలని, విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పోటీల నిర్వహణకు విశేష కృషి చేసిన మువ్వా విజయ బాబును ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కటికాల క్రిస్టఫర్ బాబు (స్టేట్ వైస్ ప్రెసిడెంట్, ఖమ్మం జిల్లా సెక్రటరీ), కె. స్వాతిముత్యం (స్టేట్ జాయింట్ సెక్రటరీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెక్రటరీ), సుధాకర్ (ఖమ్మం జిల్లా జాయింట్ సెక్రటరీ), సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ ఎం.డి. రహేన కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, సత్తుపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఇన్‌స్టాగ్రామ్ ఫేక్ అకౌంట్‌తో మోసం.. నిందితుడి అరెస్ట్

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** సోషల్ మీడియాలో మహిళల ఫొటోలను అనుమతి లేకుండా వినియోగిస్తూ, నకిలీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా ప్రజలను మోసం చేసి డబ్బులు వసూలు చేస్తున్న నిందితుడిని మావల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించినట్లు మావల సీఐ బి.డి. ప్రేమ్ కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్‌లోని బాలాజీనగర్‌కు చెందిన ఓ మహిళ 2026 సెప్టెంబర్ 10న తన మొబైల్‌లో ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చూస్తుండగా, తాను గర్భిణిగా ఉన్న సమయంలో దిగిన ఫొటోతో రూపొందించిన వీడియోను గుర్తించింది. ఆ వీడియోలో డొనేట్ రూ.5 అనే సందేశంతో పాటు క్యూఆర్ కోడ్ ఉండటాన్ని గమనించింది. సంబంధిత ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను పరిశీలించగా, తన అనుమతి లేకుండా గుర్తుతెలియని వ్యక్తి తన ఫొటోలు, వీడియోలను వినియోగిస్తున్నట్లు తెలుసుకుంది. తన ఫొటోలతో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మావల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌కు చెందిన బంగి త్రినాధ్ గా గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మహిళల ఫొటోలు, వ్యక్తిగత సమాచారాన్ని వారి అనుమతి లేకుండా సోషల్ మీడియాలో వినియోగించడం, నకిలీ ఖాతాల ద్వారా ప్రజలను మోసం చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు ఎదురైతే బాధితులు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. సైబర్ ఆర్థిక మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.




# 'పాంచజన్య సంకల్ప సభ' పోస్టర్ ఆవిష్కరణ



**ఉద్యమ కెరటం, కెరిమెరి:** మండల కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఇంద్రవెల్లిలో నిర్వహించనున్న 'పాంచజన్య సంకల్ప సభ' వాల్‌పోస్టర్‌ను నాయకులు బుధవారం ఆవిష్కరించారు. ఈనెల 30న ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్థూపం వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కవిత నాయకత్వంలో నిర్వహించే ఈ సభ ద్వారా ఉచిత విద్య, వైద్యం, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, రైతు సంక్షేమం, సామాజిక తెలంగాణ సాధన వంటి ప్రధాన అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం, వారికి రాజ్యాధికారంలో తగిన భాగస్వామ్యం కల్పించాలనే లక్ష్యంతో ఈ సంకల్ప సభను నిర్వహిస్తున్నట్లు వివరించారు. కెరిమెరి మండలంతో పాటు ఆసిఫాబాద్ జిల్లా నుంచి ప్రజలు, యువత, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొమరంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు కిరిమిళ్ల వినోద్ చారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కావేటి మనోహర్, జనరల్ సెక్రటరీ మహుల్కర్ అశోక్, జాయింట్ సెక్రటరీ నర్సింగోజు సాయికుమార్ చారి, పెందూర్ ధర్మ, రాష్ట్ర బంజారా విభాగ నాయకుడు బానోత్ కిషన్ నాయక్, బీసీ విభాగ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనివాస్, మహిళా విభాగ నాయకురాలు ధరావత్ పుష్పలత, ఎస్సీ సెల్ నాయకుడు దుర్గం శ్యామ్ రావు, అరుణ్, ఇంద్రజిత్, కోట్నాక రాము, షడుముక జంగు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య విద్యార్థినికి సూరం రవీందర్ రెడ్డి చేయూత

**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన పెంద్రం శిరీష వైద్య విద్యాభ్యాసానికి పలువురు దాతలు అండగా నిలుస్తున్నారు. పేద కుటుంబానికి చెందిన ఆమె వైద్య విద్యకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో దాతలు ముందుకు వచ్చి తమవంతు సహాయం అందిస్తున్నారు. మండలంలోని మాదారం టౌన్‌షిప్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి శిరీష వైద్య విద్యకు చేయూత అందించారు. నర్సాపూర్ గ్రామంలోని ఆమె నివాసానికి వెళ్లి బుధవారం రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా మరింత సహాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా నిర్మల్ జిల్లా కడెం మండలం లింగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు వాల్తోట్ కిషన్ కూడా స్పందించి శిరీషకు రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. పేదరికం కారణంగా ఆమె వైద్య విద్యకు దూరం కాకూడదనే సంకల్పంతో ఈ సహాయం చేసినట్లు తెలిపారు. పేదింటి గిరిపుత్రిక శిరీష వైద్య విద్యాభ్యాసాన్ని కొనసాగించి ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే మరింత మంది దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించాలని పలువురు అభిప్రాయపడ్డారు. దాతల సహకారం ఆమె భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ గ్రామ సర్పంచ్ ప్రభాత్ రావు, విద్యార్థిని తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# డంపింగ్ యార్డు తరలింపు కోసం ఈటల పాదయాత్రకు మద్దతు



**ఉద్యమ కెరటం, జవహర్ నగర్:** జవహర్ నగర్ డంపింగ్ యార్డును తరలించాలనే డిమాండ్‌తో ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టనున్న పాదయాత్రకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు బీజేపీ నేత రంగుల శంకర్ ప్రకటించారు. డంపింగ్ యార్డు కారణంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రజలతో కలిసి పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డుతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని, స్థానికుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వరకు ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డు తరలింపు కోసం చేపట్టనున్న పాదయాత్రకు ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు తెలిపి, ఐక్యంగా ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్ర సమాచార కమిషనర్ ను కలిసిన కలెక్టర్ కుమార్ దీపక్

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సింగరేణి అతిథి గృహానికి చేరుకున్న రాష్ట్ర సమాచార కమిషనర్ జి.చంద్రశేఖర్ రెడ్డిని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మర్యాదపూర్వకంగా కలిశారు. డీసీపీ ఎ.భాస్కర్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ లతో కలిసి ఆయనకు మొక్కను అందజేశారు.



# వడ్డీ వ్యాపారులపై కొరఢా

- జిల్లా వ్యాప్తంగా 25 పోలీసు బృందాలతో ఆకస్మిక దాడులు.. 19 కేసులు నమోదు
- లైసెన్సులు లేకుండా వడ్డీ వ్యాపారం నిర్వహిస్తే కఠిన చర్యలు: ఎస్పీ అఖిల్ మహాజన్



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** అధిక వడ్డీల పేరుతో రైతులు, అమాయక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న అక్రమ వడ్డీ వ్యాపారులపై జిల్లా పోలీసు యంత్రాంగం కొరఢా ఝులిపించింది. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా వ్యాప్తంగా 13 మండలాల్లో 25 పోలీసు బృందాలతో ఏకకాలంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్రమ వడ్డీ వ్యాపారానికి సంబంధించి 19 కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ తనిఖీల్లో పోలీసులు ప్రామిసరీ నోట్లు, బ్యాంకు చెక్కులు, స్టాంప్ పేపర్లు, రిజిస్టర్లు, స్థలాలు, ఇళ్లకు సంబంధించిన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలు వసూలు చేస్తూ, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం, ప్రజలకు న్యాయం చేయడం పోలీసుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అనుమతులు, లైసెన్సులు లేకుండా వడ్డీ వ్యాపారం నిర్వహించే వారిని ఉపేక్షించేది లేదని, అక్రమాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**పోలీస్ స్టేషన్ల వారీగా కేసులు..**

ఆకస్మిక దాడుల్లో ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 3, టూటౌన్ పరిధిలో 3, మావల పరిధిలో 4, ఆదిలాబాద్ రూరల్ పరిధిలో 1, జైనథ్‌లో 1, బేలలో 1, బోథ్‌లో 1, ఉట్నూర్‌లో 2, గుడిహత్నూర్‌లో 1, నార్నూర్‌లో 1, నేరడిగొండలో 1 కేసు నమోదైనట్లు ప్రకటనలో పేర్కొన్నారు.ప్రజలను అధిక వడ్డీల పేరుతో వేధించడం, అక్రమంగా ఆస్తి పత్రాలు లేదా చెక్కులను తమ వద్ద ఉంచుకోవడం వంటి చర్యలకు పాల్పడితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. అక్రమ వడ్డీ వ్యాపారాలపై నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# ఆదివాసీ హక్కుల పరిరక్షణకు భీం పోరాటం స్ఫూర్తిదాయకం

**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలో ఆదివాసీ వీరుడు, హక్కుల పోరాట యోధుడు కొమురంభీం వర్ధంతి వేడుకలను బుధవారం ఆదివాసీలు, వివిధ సంఘాల నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురంభీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీ సమాజ హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాలను, సమాజానికి అందించిన స్ఫూర్తిని నాయకులు స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొమురంభీం తన జీవితాన్ని ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం అంకితం చేశారని పేర్కొన్నారు. భూమి, అడవి, నీటిపై ఆదివాసీలకు హక్కులు ఉండాలనే లక్ష్యంతో ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఆయన చూపిన పోరాట మార్గంలో పయనిస్తూ ఆదివాసీ హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ తాండూర్ మండల అధ్యక్షుడు యాపాల సమ్మయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం మణికుమార్, మంచిర్యాల జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కుర్సెంగ బాపురావు, కొలవార్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గొలిశెట్టి బాపు, తుడుందెబ్బ విద్యార్థి సంఘం మండల ప్రధాన కార్యదర్శి అల్లకొండ అంజి, మంచిర్యాల జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, సర్పంచులు గాట్ల నర్సయ్య, ప్రభాత్ రావు, అచలపూర్ ఉపసర్పంచ్ గట్టు సంతోష్ కుమార్,



తుడుందెబ్బ మండల నాయకులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జవహర్ నగర్‌లో ఇందిరమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేయాలి

- పేదలు, అడ్డా కూలీలు, ఆటో డ్రైవర్లకు అందుబాటులోకి తేవాలి

**ఉద్యమ కెరటం, జవహర్ నగర్:** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం అందిస్తున్న రూ.5కే భోజన పథకాన్ని అమలు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. రోజువారీ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, ఆటో డ్రైవర్లు, చిరు వ్యాపారులు, నిరుపేద కుటుంబాలకు తక్కువ ధరకు భోజనం అందించేలా జవహర్ నగర్‌లో ఇందిరమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రోజువారీ కూలీలు సంపాదించే ఆదాయం కుటుంబ పోషణకే సరిపోని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన




వ్యక్తం చేస్తున్నారు. ఉదయం పనులకు వెళ్లే కార్మికులు అల్పాహారం, మధ్యాహ్న భోజనం కోసం అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తక్కువ ధరకు భోజనం అందించే క్యాంటీన్ ఏర్పాటు చేస్తే పేదలకు ఎంతో ఊరట లభిస్తుందని అభిప్రాయపడుతున్నారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ క్యాంటీన్ల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు రూ.5కే అల్పాహారం, రూ.5కే భోజనం అందించే కార్యక్రమం అమలవుతున్న నేపథ్యంలో జవహర్ నగర్‌లోనూ ఇలాంటి సౌకర్యాన్ని కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. క్యాంటీన్ అందుబాటులోకి వస్తే రోజువారీ కూలీలు, కార్మికులు, చిరు వ్యాపారులతో పాటు తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని అంటున్నారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాంతాన్ని గుర్తించి ఇందిరమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# తలమడుగును కరువు మండలంగా ప్రకటించాలి

**ఉద్యమ కెరటం, తలమడుగు:** తలమడుగు మండలాన్ని తక్షణమే కరువు ప్రాంతంగా ప్రకటించి, పంట నష్టాలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు న్యాయం చేయాలని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ డిమాండ్ చేశారు. జిల్లాలోని 20 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించినప్పటికీ, తీవ్రంగా పంట నష్టపోయిన తలమడుగు మండలాన్ని మినహాయించడం ద్వారా రైతులకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. బుధవారం ఆడే గజేందర్, మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం సమర్పించారు. తలమడుగు మండలంలో ఆశించిన స్థాయిలో పంట దిగుబడులు రాక రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. పంటల సాగు కోసం పెట్టుబడులు పెట్టిన రైతులు దిగుబడులు తగ్గడంతో నష్టాల పాలవుతున్నారని, ఈ పరిస్థితుల్లో మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులకు తగిన సహాయం అందించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ తలమడుగు మండల పరిస్థితులపై ప్రభుత్వానికి నివేదికలు పంపించి, రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.ప్రతాప్, మాజీ జడ్పీటీసీ బి.బాబన్న, మాజీ ఎంపీపీ కె.లక్ష్మి రాజేశ్వర్, నాయకులు ప్రకాష్ రావు, వెంకన్న, రమేష్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, సాంబశివ్, సర్పంచులు నగేష్, వెంకటేష్, మార్కెట్ డైరెక్టర్ పోశెట్టి, యూత్ కాంగ్రెస్ నాయకుడు సాయి కిరణ్, ఎస్సీ



సెల్ నాయకులు రాజేశ్వర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# భూదాన్ భూములు, రీసర్వే వేగవంతం చేయాలి

- రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్ లోకేష్ కుమార్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** భూదాన్ భూములు, భూముల రీసర్వే, భూభారతి పథకానికి సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్ లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని భూపరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు (రెవెన్యూ), కలెక్టరేట్ పరిపాలనాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా భూదాన్ భూములు, రీసర్వే ప్రక్రియ, న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సంబంధిత కేసులు, భూసేకరణ, జీఓలు 59, 76, 118 కింద పెండింగ్ దరఖాస్తులు, భూభారతి దరఖాస్తులు, విజిలెన్స్, ఇంటెలిజెన్స్ కేసుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూదాన్ భూములకు సంబంధించిన నివేదికలను సిద్ధం చేయడంతో పాటు భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న భూ వివాదాల కేసులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, భూసేకరణకు సంబంధించిన అంశాలను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని తెలిపారు. యూఎల్‌సీ భూములు, జీఓలు 59, 76, 118 కింద క్రమబద్ధీకరణ కోసం వచ్చిన పెండింగ్ దరఖాస్తుల స్థితిగతులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూభారతి కార్యక్రమంలో భాగంగా పాత, కొత్త పెండింగ్ దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ నిర్వహించి, సంబంధిత భూ రికార్డులను పరిశీలించిన అనంతరం నిర్ణీత నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. విజిలెన్స్, ఇంటెలిజెన్స్ విభాగాలకు సంబంధించిన కేసుల పురోగతిని వేగవంతం చేయాలని, భూపరిపాలనకు సంబంధించిన పెండింగ్ అంశాలను నిరంతరం పర్యవేక్షిస్తూ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో రీసర్వే పనులు సమర్థవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. భూభారతి కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నిబంధనల ప్రకారం, నిర్ణీత గడువులోగా సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తున్నామని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీనివాసరావు దేశ్‌పాండే, బి, డి సెక్షన్ల సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మైనార్టీ, ఎస్సీ విభాగాల నాయకులకు సన్మానం



**ఉద్యమ కెరటం, బోథ్:** బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, ఆర్ఏజీపీఆర్ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆడే గజేందర్ ఆధ్వర్యంలో మైనార్టీ, ఎస్సీ విభాగాల నాయకుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకులను అభినందిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మొదట ఆడే గజేందర్ క్యాంప్ కార్యాలయంలో మైనార్టీ, ఎస్సీ విభాగాల నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఆయన నాయకత్వంలో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం నేరడిగొండ కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో జిల్లా మైనార్టీ విభాగ ఉపాధ్యక్షుడు మహమ్మద్ ముస్తఫా, జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ జనరల్ సెక్రటరీ కొత్తూరి లక్ష్మణ్, జిల్లా మైనార్టీ విభాగ కార్యదర్శి అబ్దుల్ రషీద్‌లను ఆడే గజేందర్ శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మైనార్టీ, ఎస్సీ విభాగాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన నాయకులు మరింత ఉత్సాహంతో పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు షేక్ సద్దాం, మాజీ ఎంపీటీసీ జహీద్, ఐఎన్‌టీయూసీ ఇచ్చోడ మండల అధ్యక్షుడు మునేశ్వర్ కొటేష్, రాథోడ్ మహేందర్ తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గంభీరావుపేటను కరువు మండలంగా ప్రకటించాలి



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండలంలో సాధారణ వర్షపాతం కంటే 30 నుంచి 35 శాతం తక్కువ వర్షాలు నమోదైన నేపథ్యంలో మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ మండల నాయకులు స్థానిక తహశీల్దార్ మారుతి రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంభీరావుపేట మండలంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సాధారణ వర్షపాతం కంటే గణనీయంగా తక్కువ వర్షాలు కురవడంతో వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏ ప్రాతిపదికన మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటిస్తోందో స్పష్టం చేయాలని ప్రశ్నించారు. మండలంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర సర్వే నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ధార్మిక సెల్ కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు సర్వోత్తమ్, ఎస్సీ మోర్చా నాయకుడు, ఐటీ సెల్ కన్వీనర్ రవీందర్ నాయక్, సోషల్ మీడియా కన్వీనర్ దేవేందర్ యాదవ్, నాయకులు కృష్ణకాంత్ యాదవ్, రవీందర్, తిరుపతి, ఎల్లం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ్ నగర్ కాలనీలో ప్రజా సమస్యలపై ఆరా

**ఉద్యమ కెరటం, జవహర్ నగర్:** జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీలో నెలకొన్న ప్రజా సమస్యలను జవహర్ నగర్ మాజీ మేయర్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షురాలు శాంతి కోటేష్ గౌడ్ అడిగి తెలుసుకున్నారు. బుధవారం కాలనీలో పర్యటిస్తూ స్థానిక ప్రజలతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు తమ సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిశీలించిన శాంతి కోటేష్ గౌడ్ ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించారు. స్థానికుల ఇబ్బందులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయడం తన బాధ్యత అని పేర్కొన్నారు.



# మంత్రి అజారుద్దీన్‌ను కలిసిన సన్‌రైజ్ ఫౌండేషన్ అధ్యక్షుడు

**ఉద్యమ కెరటం, జైనూర్:** తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్‌ను సన్‌రైజ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ షేక్ జమీల్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. మైనారిటీల అభ్యున్నతికి, విద్యాభివృద్ధికి మరింత ప్రాధాన్యత కల్పించాలని కోరారు.





# దశల వారీగా సమస్యలను పరిష్కరిస్తూ గ్రామాభివృద్ధికి కృషి

## నేరడిగొండ సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి

**ఉద్యమ కెరటం, నేరడిగొండ : స్థానికంగా నెలకొన్న సమస్యలను దశవారీగా పరిష్కారిస్తూ, గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని నేరడిగొండ గ్రామ సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఉద్యమ కెరటం, విలేకరి సర్పంచ్‌తో తీసుకున్న ప్రత్యేక ఇంటర్వ్యూ...**

ఉద్యమ కెరటం ఇంటర్వ్యూ

**సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామంలో మీరు గుర్తించిన ప్రధాన సమస్యలు ఏమిటి?**

గ్రామంలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి కొన్ని ప్రధాన సమస్యలను గుర్తించాం. గ్రామ ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటూ, ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

**గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారు?**

గ్రామంలో ప్రతి ఇంటికి సరిపడా తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటాం. నీటి ట్యాంకులు, బోర్లు, పైప్‌లైన్ల పరిస్థితిని పరిశీలించి, మరమ్మతులు అవసరమైతే అధికారుల సహకారంతో చేయిస్తాం. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపడతాం.

**గ్రామంలోని రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాల సమస్యలను పరిష్కరించేందుకు మీ ప్రణాళిక ఏమిటి?**

గ్రామంలోని దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీలను గుర్తించి మరమ్మతులు చేయించేందుకు కృషి చేస్తాం. పనిచేయని వీధి దీపాలను బాగు చేయిస్తాం. అవసరమైన అభివృద్ధి పనుల కోసం సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు పంపి నిధులు తీసుకురావడానికి ప్రయత్నిస్తాం.

**గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరచడానికి, చెత్త సమస్యను పరిష్కరించడానికి ఏం చేయబోతున్నారు?**

గ్రామంలో నిత్యం పారిశుధ్య పనులు జరిగేలా చూస్తాం. వీధులు, మురుగు కాలువలను శుభ్రంగా ఉంచడంతో పాటు చెత్తను సక్రమంగా సేకరించేలా చర్యలు తీసుకుంటాం. గ్రామ ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించి, పరిశుభ్రమైన గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం.

**పంచాయతీకి నిధులు ఎలా వస్తాయి? గ్రామాభివృద్ధికి నిధులు సమకూర్చేందుకు అధికారులను సంప్రదిస్తున్నారా?**

గ్రామ పంచాయతీకి ప్రభుత్వ గ్రాంట్లు, వివిధ అభివృద్ధి పథకాల నిధులు, పంచాయతీ ఆదాయం ద్వారా నిధులు సమకూరుతాయి. గ్రామానికి అవసరమైన పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం. సంబంధిత అధికారులను, ప్రజాప్రతినిధులను సంప్రదించి నిధులు తీసుకురావడానికి కృషి చేస్తాం.

**గ్రామంలోని పేదలు, వృద్ధులు, మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ఎలాంటి చర్యలు తీసుకుంటారు?**

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా సహకరిస్తాం. పథకాలకు దరఖాస్తు చేసుకునే విధానం గురించి అవగాహన కల్పిస్తాం. అర్హులైన వారికి పథకాలు అందకపోతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తాం.

**ప్రజలు తమ సమస్యలను మీ దృష్టికి తీసుకురావడానికి ఎలాంటి అవకాశం కల్పిస్తారు? సభలు నిర్వహిస్తారా?**

గ్రామ ప్రజలు ఎప్పుడైనా తమ సమస్యలను మా దృష్టికి తీసుకురావచ్చు. గ్రామసభలు నిర్వహించి ప్రజల అభిప్రాయాలు, అవసరాలు తెలుసుకుంటాం. ప్రజల భాగస్వామ్యంతో గ్రామ అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తాం. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే సర్పంచ్‌గా పనిచేస్తాం.

**మీ పదవీకాలంలో గ్రామంలో ముందుగా పరిష్కరించాలనుకుంటున్న మూడు ప్రధాన సమస్యలు ఏమిటి? వాటిని ఎప్పటిలోగా పరిష్కరించగలరు?**

ముందుగా తాగునీటి సమస్య, రోడ్లు-డ్రైనేజీల సమస్య, పారిశుధ్యంపై దృష్టి పెడతాం. వీటిలో అత్యవసరమైన సామూహిక మరుగుదొడ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేందుకు ప్రయత్నిస్తాం. మిగతా పనులకు అవసరమైన నిధులు, అధికారుల అనుమతులు వచ్చిన మేరకు దశలవారీగా పూర్తి చేస్తాం.

**ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ "గ్రామ ప్రజలు నాపై నమ్మకంతో సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తాను. ప్రజల సహకారంతో గ్రామంలోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ,స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ అధికారుల సహకారంతో అవసరమైన నిధులు తీసుకువచ్చి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తాను."**






# క్రీడాలోకంలో విషాదం

## పారా అథ్లెట్ నీరజ్ యాదవ్ బలవన్మరణం!

### మూడుసార్లు ఆసియా పారా క్రీడల్లో స్వర్ణ పతకాలు సాధించిన దిగ్గజం

### డోపింగ్ నిషేధం నేపథ్యంలో మానసిక ఒత్తిడికి గురైనట్లు ప్రచారం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 28 :** భారత క్రీడా రంగంలో విషాదం చోటుచేసుకుంది. ఆసియా పారా క్రీడల్లో మూడు స్వర్ణ పతకాలు సాధించి అంతర్జాతీయ వేదికపై భారత పతాకాన్ని రెపరెపలాడించిన ప్రముఖ పారా అథ్లెట్ నీరజ్ యాదవ్ (42) బలవన్మరణానికి పాల్పడినట్లు సమాచారం. ఢిల్లీలోని తన నివాసంలో బుధవారం విషం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనతో క్రీడాకారులు, శిక్షకులు, క్రీడాభిమానులు దిగ్భ్రాంతికి గురయ్యారు. నీరజ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఢిల్లీలోని ఆసుపత్రికి తరలించారు. ఆయన మృతికి దారితీసిన పరిస్థితులపై స్పష్టత రావాల్సి ఉంది. ఇటీవల డోపింగ్ నిషేధం కారణంగా నీరజ్ యాదవ్ ఆసియా పారా క్రీడల్లో పాల్గొనే అర్హత కోల్పోయినట్లు సమాచారం. ఈ పరిణామం నేపథ్యంలో ఆయన మానసిక ఒత్తిడికి గురై ఉండవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే నిషేధానికి, ఆయన మరణానికి మధ్య సంబంధం ఉందని నిర్ధారించే ఆధారాలు ఇంకా వెల్లడికాలేదు. ఈ ఘటనపై భారత పారా అథ్లెటిక్స్ జట్టు ప్రధాన కోచ్ ఎస్. సత్యనారాయణ స్పందించారు. నీరజ్ మరణం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఈ నిర్ణయం తీసుకోవడానికి కచ్చితమైన కారణం ఏమిటో చెప్పలేమని పేర్కొన్నారు. ప్రతిభావంతుడైన క్రీడాకారుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. భారత పారా అథ్లెటిక్స్‌లో నీరజ్ యాదవ్ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. 2018లో జకార్తా వేదికగా జరిగిన ఆసియా పారా క్రీడల్లో జావెలిన్ త్రో విభాగంలో స్వర్ణ పతకం సాధించారు. అనంతరం 2023లో హాంగ్‌జౌలో జరిగిన ఆసియా పారా క్రీడల్లో జావెలిన్ త్రో, డిస్కస్ త్రో విభాగాల్లో మరో రెండు స్వర్ణ పతకాలు గెలుచుకున్నారు. మొత్తంగా మూడు స్వర్ణ పతకాలతో భారత పారా క్రీడా చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్నారు. ఏడేళ్ల వయసులో పోలియో అనంతర పక్షవాతం కారణంగా శారీరక వైకల్యాన్ని ఎదుర్కొన్న నీరజ్ యాదవ్ క్రీడలపై ఆసక్తిని కోల్పోలేదు. తొలుత వీల్‌చైర్ టెన్నిస్‌లో ప్రతిభ కనబరిచిన ఆయన అనంతరం పారా అథ్లెటిక్స్ వైపు అడుగులు వేశారు. ఎఫ్--55 విభాగంలో జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, షాట్‌పుట్ పోటీల్లో పాల్గొంటూ అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు. ఎన్నో సవాళ్లను అధిగమించి స్వర్ణ పతకాలు సాధించిన నీరజ్ అకాల మరణం భారత పారా క్రీడా రంగానికి తీరని లోటుగా మిగిలింది.

# టీ20లో మళ్లీ అభిషేక్ దే అగ్రస్థానం!

**దుబాయ్, అక్టోబర్ 28:** అంతర్జాతీయ క్రికెట్ మండలి తాజాగా విడుదల చేసిన ఆటగాళ్ల ర్యాంకింగ్స్‌లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. భారత యువ విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో తిరిగి అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. మరోవైపు దక్షిణాఫ్రికా స్టార్ ఆల్‌రౌండర్ మార్కో యాన్సెన్ టెస్టు బౌలింగ్‌తోపాటు ఆల్‌రౌండర్ల విభాగంలోనూ నంబర్‌వన్ స్థానానికి చేరుకున్నాడు. ఈ రెండు విభాగాల్లో ఒకేసారి అగ్రస్థానం సాధించడం యాన్సెన్ కెరీర్‌లో ఇదే తొలిసారి. దీంతో నాలుగేళ్లకు పైగా టెస్టు ఆల్‌రౌండర్ల జాబితాలో అగ్రస్థానంలో కొనసాగిన భారత స్టార్ రవీంద్ర జడేజా రెండో స్థానానికి పడిపోయాడు. న్యూజిలాండ్‌తో వెల్లింగ్‌టన్ వేదికగా జరిగిన మూడో టీ20లో అభిషేక్ శర్మ విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 35 బంతుల్లోనే శతకం పూర్తి చేసిన అభిషేక్ మొత్తం 38 బంతుల్లో 113 పరుగులు సాధించి సత్తా చాటాడు. ఈ ప్రదర్శనతో సహచర ఆటగాడు ఇషాన్ కిషన్‌ను అధిగమించి టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో తిరిగి నంబర్‌వన్ స్థానానికి చేరుకున్నాడు. అభిషేక్ తొలిసారిగా 2025 జులైలో అగ్రస్థానాన్ని అందుకున్నాడు. తాజా ప్రదర్శనతో మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్నాడు. ఆస్ట్రేలియాతో గెబెర్హాలో జరిగిన రెండో టెస్టులో మార్కో యాన్సెన్ అద్భుత ప్రదర్శన చేశాడు. బ్యాటింగ్‌లో 85 పరుగులు సాధించడంతోపాటు ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు పడగొట్టి దక్షిణాఫ్రికా విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనతో టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఏకంగా ఐదు స్థానాలు ఎగబాకి ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్‌ను అధిగమించాడు. ఆల్‌రౌండర్ల విభాగంలోనూ రవీంద్ర జడేజాను వెనక్కి నెట్టి అగ్రస్థానాన్ని సొంతం చేసుకున్నాడు. నాలుగేళ్లకు పైగా ఈ విభాగంలో అగ్రస్థానంలో కొనసాగిన జడేజా ఆధిపత్యానికి యాన్సెన్ తెరదించాడు. టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా నాలుగు స్థానాలు మెరుగుపర్చుకొని రెండో ర్యాంకుకు చేరుకున్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన



టెస్టులో 179 పరుగులతో రాణించి మ్యాచ్ ఉత్తమ ఆటగాడిగా నిలవడం అతడి ర్యాంకు మెరుగుదలకు దోహదపడింది. ఈ జాబితాలో ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. భారత ఆటగాళ్లు సంజూ శాంసన్, అర్ష్‌దీప్ సింగ్ కూడా తాజా ర్యాంకింగ్స్‌లో పురోగతి సాధించారు. టీ20 బ్యాటింగ్ విభాగంలో సంజూ శాంసన్ ఆరు స్థానాలు ఎగబాకి 20వ ర్యాంకుకు చేరుకున్నాడు. బౌలింగ్ విభాగంలో అర్ష్‌దీప్ సింగ్ 15వ స్థానానికి చేరుకున్నాడు. మొత్తంగా తాజా ర్యాంకింగ్స్‌లో భారత యువ ఆటగాళ్లతోపాటు దక్షిణాఫ్రికా క్రికెటర్లు కూడా తమ ప్రదర్శనతో సత్తా చాటారు.

# వైష్ణవి స్పిన్ మాయాజాలం.. జింబాబ్వే విలవిల!

- ఐదు వికెట్లతో చెలరేగిన భారత యువ స్పిన్నర్
- మూడో వన్డేలో 131 పరుగులకే జింబాబ్వే ఆలౌట్
- 39 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టిన వైష్ణవి శర్మ
- క్రాంతి గౌడ్, సయాలి సత్ఘరేలకు చెరో రెండు వికెట్లు
- సిరీస్ క్లీన్‌స్వీప్‌పై కన్నేసిన భారత మహిళల జట్టు



**వడోదర, అక్టోబర్ 28 :** జింబాబ్వే మహిళల జట్టుతో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో భారత మహిళల జట్టు మరోసారి బౌలింగ్‌లో అదరగొట్టింది. ఇప్పటికే వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత్ మూడో వన్డేలోనూ ప్రత్యర్థిపై ఆధిపత్యం ప్రదర్శించింది. యువ స్పిన్నర్ వైష్ణవి శర్మ ఐదు వికెట్లతో చెలరేగడంతో జింబాబ్వే జట్టు 39.5 ఓవర్లలో కేవలం 131 పరుగులకే ఆలౌటైంది. వైష్ణవి 39 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి బ్యాటింగ్ పతనంలో కీలక పాత్ర పోషించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే జట్టుకు భారత బౌలర్లు ఆరంభం నుంచే కట్టడి చేశారు. ఓపెనర్ మోడెస్టర్ ముపాచిక్వా 37 పరుగులతో జట్టులో అత్యధిక స్కోరు సాధించగా, కెప్టెన్ జోసెఫిన్ ఎన్కోమో 35 పరుగులతో రాణించింది. చిద్జా ధురురు 20 పరుగులు, న్యాషా గ్వాంజురా 10 పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు భారత బౌలర్ల ధాటికి నిలవలేకపోవడంతో జింబాబ్వే స్వల్ప స్కోరుకే పరిమితమైంది. భారత బౌలర్లలో వైష్ణవి శర్మ తన స్పిన్‌తో జింబాబ్వే బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టింది. కీలక సమయాల్లో వికెట్లు పడగొడుతూ ప్రత్యర్థిని కోలుకోనివ్వలేదు. ఆమెకు క్రాంతి గౌడ్, సయాలి సత్ఘరే చక్కటి సహకారం అందించారు. వీరిద్దరూ చెరో రెండు వికెట్లు పడగొట్టడంతో జింబాబ్వే భారీ స్కోరు సాధించలేకపోయింది. ఇప్పటికే రెండు వన్డేల్లో విజయం సాధించిన భారత మహిళల జట్టు మూడో మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్‌ను 3--0తో క్లీన్‌స్వీప్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు భారత బ్యాటర్లు 132 పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సి ఉంది.

# పాక్ గడ్డపై లంక పేసర్ చరిత్ర.. 30 ఏళ్ల రికార్డు బద్దలు!

## లాహోర్‌లో దిల్షాన్ మదుషంక బౌలింగ్ విధ్వంసం

**లాహోర్, అక్టోబర్ 28 :** పాకిస్థాన్ గడ్డపై శ్రీలంక యువ పేసర్ దిల్షాన్ మదుషంక చరిత్ర సృష్టించాడు. ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో అద్భుత బౌలింగ్‌తో పాకిస్థాన్ బ్యాటింగ్‌ను కుప్పకూల్చాడు. కేవలం 34 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టి పాకిస్థాన్‌లో ఆ జట్టుపై అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన విదేశీ పేసర్‌గా సరికొత్త రికార్డు నెలకొల్పాడు. ఈ క్రమంలో న్యూజిలాండ్ బౌలర్ క్రిస్ హారిస్ పేరిట ఉన్న 30 ఏళ్ల రికార్డును అధిగమించాడు. మదుషంక ధాటికి పాకిస్థాన్ 110 పరుగులకే ఆలౌట్ కాగా, శ్రీలంక ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి ముక్కోణపు సిరీస్ ఫైనల్‌కు అర్హత సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్‌కు శ్రీలంక బౌలర్లు చుక్కలు చూపించారు. ముఖ్యంగా దిల్షాన్ మదుషంక పదునైన బంతులతో పాక్ బ్యాటర్లను వరుసగా పెవిలియన్‌కు పంపించాడు. ఫఖర్ జమాన్ (5), సాద్ బేగ్ (5), అరాఫత్ మిన్హాస్ (10), కెప్టెన్ షాహీన్ అఫ్రిది (15), హ్యారిస్ రవూఫ్ (1) వికెట్లను పడగొట్టాడు. మదుషంక ధాటికి పాకిస్థాన్ 25.3 ఓవర్లలో కేవలం 110 పరుగులకే ఆలౌటైంది. బాబర్ ఆజమ్ 29 పరుగులతో జట్టులో అత్యధిక స్కోరు సాధించాడు. స్వదేశంలో పాకిస్థాన్‌కు ఇది రెండో అత్యల్ప వన్డే స్కోరుగా నమోదైంది. అద్భుత ప్రదర్శన చేసిన మదుషంకకు మ్యాచ్ ఉత్తమ ఆటగాడి పురస్కారం లభించింది. పాకిస్థాన్ గడ్డపై ఆ జట్టుతో జరిగిన వన్డే మ్యాచ్‌లో ఐదు వికెట్లు తీసిన విదేశీ పేసర్లలో మదుషంక అత్యుత్తమ గణాంకాలు నమోదు చేశాడు. 1996లో లాహోర్ వేదికగా న్యూజిలాండ్ బౌలర్ క్రిస్ హారిస్ 42 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. ఇప్పటివరకు కొనసాగిన ఆ రికార్డును మదుషంక 34 పరుగులకే ఐదు వికెట్లు తీసి అధిగమించాడు. గతంలో ఆస్ట్రేలియా పేసర్ క్రెయిగ్ మెక్‌డెర్మాట్ 1987లో సియాల్‌కోట్‌లో 44 పరుగులిచ్చి ఐదు వికెట్లు తీయగా, జింబాబ్వే బౌలర్ బ్లెస్సింగ్ ముజరబానీ 2020లో లాహోర్‌లో 49 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. వీరందరినీ వెనక్కి నెట్టిన మదుషంక పాకిస్థాన్ గడ్డపై అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. బౌలర్ల అద్భుత ప్రదర్శనతో పాకిస్థాన్‌ను స్వల్ప స్కోరుకే పరిమితం చేసిన శ్రీలంక లక్ష్యాన్ని కేవలం రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఎనిమిది వికెట్ల తేడాతో విజయం సాధించి ముక్కోణపు సిరీస్ ఫైనల్‌కు చేరుకుంది. శనివారం జరిగే తుదిపోరులో మరోసారి పాకిస్థాన్‌తో శ్రీలంక తలపడనుంది. సొంతగడ్డపై పరాజయం ఎదుర్కొన్న పాకిస్థాన్ ఫైనల్‌లో ప్రతీకారం తీర్చుకోవాలని భావిస్తుండగా, అదే జోరును కొనసాగించి టైటిల్ దక్కించుకోవాలని శ్రీలంక లక్ష్యంగా పెట్టుకుంది.



# ఆ సినిమా తర్వాత ఇబ్బంది పడ్డా



'మహానటి' సినిమాతో నేషనల్ అవార్డు కొట్టి సౌత్‌లోనే టాప్ హీరోయిన్‌గా నిలబడింది కీర్తి సురేష్. సావిత్రి గారి పాత్రలో ఆమె చూపించిన నటనకు అందరూ ఫిదా అయి-పోయారు. ఆ మూవీ తర్వాత కీర్తి క్రేజ్ ఎక్కడికో వెళ్లిపోయింది. కానీ, తెరపై అంత పెద్ద హిట్ చూసిన తర్వాత కూడా.. ఆమె నిజ జీవితంలో ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారంటే ఎవరూ నమ్మలేరు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన కీర్తి, 'మహానటి' తర్వాత తాను ఫేస్ చేసిన పరిస్థితుల గురించి ఓపెన్‌గా మాట్లాడారు. 'మహానటి' హిట్ కొట్టగానే కీర్తి చకచకా సినిమాలు చేసుకుంటూ పోతుందని అంతా అనుకున్నారు. కానీ ఆమె ఏకంగా ఆరు నెలల పాటు ఇండస్ట్రీకి దూరంగా ఉండి బ్రేక్ తీసుకున్నారు. ఆ విరామం గురించి చెబుతూ.. "మహానటి తర్వాత నేను తీసుకున్న ఆరు నెలల బ్రేక్ వల్ల నా ఫైనాన్షియల్ పొజిషన్ పూర్తిగా తలకిందులైంది. ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డాను" అంటూ నిజం బయటపెట్టారు. అయితే ఆ గ్యాప్ తీసుకున్నందుకు తాను ఏమాత్రం బాధపడట్లేదని కీర్తి చెప్పారు. ఆ బ్రేక్ తన లైఫ్‌లో ఎంతో మార్పు తీసుకొచ్చిందని అన్నారు. "ఆ టైమ్‌లోనే నా ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై పూర్తి శ్రద్ధ పెట్టాను. అప్పటివరకు నేను కాస్త బొద్దుగా ఉండేదాన్ని. దాంతో రెగ్యులర్‌గా వర్కవుట్లు చేస్తూ నన్ను నేను హెల్దీగా మార్చుకున్నాను. అన్నింటికంటే ముఖ్యంగా, డబ్బుని ఎలా దాచుకోవాలి, ఫైనాన్షియల్ ప్లానింగ్ ఎంత ముఖ్యం అనేది ఆ ఆరు నెలల గ్యాప్‌లోనే బాగా అర్థమైంది" అని కీర్తి చెప్పుకొచ్చారు. అంత పెద్ద హిట్ తర్వాత కూడా ఇలాంటి సమస్యలు వచ్చాయని ధైర్యంగా ఒప్పుకోవడం నిజంగా గొప్ప విషయమే. ప్రస్తుతం కీర్తి సురేష్ చేసిన ఈ కామెంట్స్ నెట్టింట బాగా వైరల్ అవుతున్నాయి.




# సైలెంట్‌గా 'ఇంజి వెల్లమ్'
## షూటింగ్ పూర్తి చేసిన మణిరత్నం
### సినీ సర్కిల్స్‌లో హాట్ టాపిక్!

సాధారణంగా దిగ్గజ దర్శకుల సినిమాలు సెట్స్‌పైకి వెళ్లాయంటే చిత్రీకరణ పూర్తి కావడానికి ఏళ్ల తరబడి సమయం పడుతుంటుంది. అయితే ప్రముఖ దర్శకుడు మణిరత్నం మాత్రం ఎలాంటి ఆర్భాటం, హడావుడి లేకుండా చాలా సైలెంట్‌గా తన కొత్త చిత్రం 'ఇంజి వెల్లమ్' షూటింగ్‌ను చకచకా పూర్తి చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. విజయ్ సేతుపతి, సాయి పల్లవి కాంబినేషన్‌లో వస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ చిత్రీకరణ పూర్తి చేసుకోవడం ఇప్పుడు సినీ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. మణిరత్నం తనదైన ముందస్తు ప్రణాళికతో చాలా నిశ్శబ్దంగా ఈ సినిమా షూటింగ్‌ను ముగించారని సమాచారం. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగవంతంగా జరుపుకుంటోంది. ఎలాంటి పాత్రలోనైనా ఒదిగిపోయే విజయ్ సేతుపతి, సహజ నటనతో అలరించే సాయి పల్లవి తొలిసారి కలిసి నటిస్తుండటంతో ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరిద్దరినీ మణిరత్నం తన మార్క్ ఫ్రేమింగ్‌లో ఏ విధంగా చూపించబోతున్నారో అనే కుతూహలం మూవీ లవర్స్‌లో పెరిగిపోయింది. సంక్రాంతి సందడి ముగిసిన వెంటనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. వచ్చే ఏడాది మొదట్లోనే, సరిగ్గా 2027 జనవరి 29న ఈ సినిమాను థియేటర్లలోకి దించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలుస్తోంది. అతి త్వరలోనే ఈ విడుదల తేదీకి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడనుంది.

# ఏఐ నన్ను భయపెడుతోంది
### సోషల్ మీడియాపై కృతి సనన్ ఆందోళన!



సమాజంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రముఖ బాలీవుడ్ నటి కృతి సనన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఒక మీడియా సమ్మిట్‌లో ఆమె మాట్లాడుతూ, టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, దాన్ని నియంత్రించే చట్టాలు మాత్రం ఆ స్థాయిలో లేవని అన్నారు. అసలు ఫోటో ఏది, ఏఐ సృష్టించిన ఫోటో ఏది అని గుర్తించడం చాలా కష్టంగా మారిందని ఆమె తెలిపారు. సోషల్ మీడియా వేదికలపై ఏఐ ద్వారా వచ్చే తప్పుడు చిత్రాలను తొలగించడం చాలా సవాలుగా మారిందని కృతి సనన్ చెప్పారు. ఉదాహరణకు ఇన్ స్టాగ్రామ్ లో తన పోలికలతో ఎవరో ఒకరు ఏఐ ఇమేజ్ పోస్ట్ చేస్తే, దాన్ని రిపోర్ట్ చేయడానికి ప్రత్యేకంగా 'ఇది నా ఏఐ-జనరేటెడ్ ఇమేజ్, కాబట్టి దీన్ని తొలగించాలి' అనే ఆప్షన్ కూడా ప్రస్తుతం అందుబాటులో లేదని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. టెక్నాలజీ ఎంత వేగంగా మారుతున్నా, దానికి తగినట్లుగా సోషల్ మీడియా నిబంధనలు ఇంకా మారలేదని ఆమె అభిప్రాయపడ్డారు. ఏఐ టెక్నాలజీ తనను తీవ్రంగా భయపెడుతోందని కృతి సనన్ అన్నారు. ఇది కేవలం ఒక టూల్ మాత్రమేనని, కానీ టూల్ ఎంత పదునుగా ఉంటే అది అంత ప్రమాదకరమని హెచ్చరించారు. కొత్త ఆవిష్కరణలకు తాను పూర్తిగా అనుకూలమే అయి-నప్పటికీ, వ్యక్తిగత హక్కుల విషయంలో ఏఐ తెచ్చిపెడుతున్న మార్పులు చాలా భయానకంగా ఉన్నాయని, తక్షణమే కఠినమైన చట్టాలు రావాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు.

# ఎరుపు లెహంగాలో మాళవిక మోహనన్

నటి మాళవిక మోహనన్ తన అందమైన ఫ్యాషన్ లుక్‌తో ఆకట్టుకుంటోంది. ఎరుపు రంగు లెహంగాలో సంప్రదాయ సొగసుతో పాటు గ్లామర్‌ను జోడించి ప్రత్యేక ఆకర్షణగా నిలి చింది. ఆమె లుక్‌కు సంబంధించిన ఫొటోలు అభిమానులను ఆకర్షిస్తు న్నాయి. లోతైన నెక్‌లైన్‌తో రూపొందించిను బ్లౌజ్‌పై బంగారు రంగు ఎంబ్రాయిడరీ అందంగా మెరిసింది. బంగారు అంచుతో కూడిన పలుచని దుపట్టా ఆమె రూపానికి మరింత హుందాతనాన్ని తీసుకొచ్చింది. జుంకాలు, చేతి నిండా గాజులు, అద్దాల పనితనంతో కూడిన పొట్లీ బ్యాగ్‌ను జత చేసి తన స్టైలింగ్‌ను పూర్తి చేసింది. చక్కగా ముడివేసిన జుట్టు, చిన్న బిందీతో మాళవిక తన సంప్రదాయ రూపానికి మరింత అందాన్ని అద్దింది. సంప్రదాయ వస్త్రధారణలోనూ గ్లామరస్‌గా కనిపించవచ్చని తన లుక్‌తో మరోసారి చాటిచెప్పింది.





Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN**, and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: 9030717172, 9391127717

# తెలంగాణ రక్షణ సేనలోకి కాంగ్రెస్ నేతల చేరికలు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని గాజిలి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీలో చేరారు. బోథ్ మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రక్షణ సేన ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ బాపురావు సమక్షంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో ఈ చేరికల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన వారికి రాథోడ్ బాపురావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రాథోడ్ బాపురావు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై, స్వచ్ఛందంగా తెలంగాణ రక్షణ సేనలో చేరినట్లు నూతనంగా చేరిన నాయకులు తెలిపారు. కల్వకుంట్ల కవిత నాయకత్వంలో పార్టీ ప్రస్తావిస్తున్న ఉచిత విద్య, వైద్యం, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆసక్తితో పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాథోడ్ బాపురావు మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకలు



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వేంసూరు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కేక్ కట్ చేసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజలకు మరింత సేవలందించాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ రెహనా కమల్ పాషా, వేంసూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్ రెడ్డి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సోమిరెడ్డి, వేంసూరు మండల కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మాధాపూర్ సర్పంచ్ షేక్ ఇమ్రాన్ షాదుల్లా ఉదారత

## పేద ఆడబిడ్డ పెళ్లికి రూ.1లక్ష ఆర్థిక సాయం



**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు మాధాపూర్ గ్రామ సర్పంచ్ షేక్ ఇమ్రాన్ షాదుల్లా. గ్రామానికి చెందిన ఒక పేద కుటుంబంలో ఆడపిల్ల వివాహానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో, ఆయన తన ఎన్నికల మేనిఫెస్టో హామీని నిలబెట్టుకుంటూ తక్షణ సహాయంగా రూ.1లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు. పేద కుటుంబాలకు అండగా నిలవడం, ఆర్థిక భారంతో ఆడపిల్లల వివాహాలు ఆగకూడదనే ఉన్నత లక్ష్యంతో సర్పంచ్ ఈ చొరవ తీసుకున్నారు. కేవలం డబ్బులు ఇవ్వడమే కాకుండా, సదరు కుటుంబానికి భారం కాకూడదనే ఉద్దేశంతో, భవిష్యత్తులో ప్రభుత్వ కళ్యాణలక్ష్మీ పథకం డబ్బులు వచ్చినప్పుడు, వారు తిరిగి చెల్లించగలిగినప్పుడు ఎలాంటి వడ్డీ లేకుండా కేవలం అసలు మాత్రమే తీసుకునేలా సర్పంచ్ అంగీకరించారు. సర్పంచ్ ఇమ్రాన్ షాదుల్లా చూపిన ఈ మానవత్వానికి, ఉదార గుణానికి గ్రామస్తుల నుంచి పెద్ద ఎత్తున ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు షేక్ షాదుల్లా, గ్రామ పెద్దలు మేకల శ్రీనివాస్, షిండే వినాయక్, ఆనంద్ రావు పటేల్, షేక్ చాంద్, మహమ్మద్ మురాద్ తదితరులు పాల్గొని సర్పంచ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు.

# మంత్రులను కలిసిన ఏఎంసీ చైర్మన్, పాలకవర్గ సభ్యులు



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నూతన చైర్మన్ హమీద్, వైస్ చైర్మన్ భాస్కర్‌తో పాటు పాలకవర్గ సభ్యులు బుధవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ గౌడ్, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రులు నూతన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ హమీద్ మాట్లాడుతూ తనకు చైర్మన్‌గా అవకాశం కల్పించేందుకు సహకరించిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ పరిధిలో రైతులకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, విక్రయాల్లో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గంభీరావుపేట మండల రైతుల అభ్యున్నతికి, మార్కెట్ కమిటీ అభివృద్ధికి పాలకవర్గ సభ్యులందరితో కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు శ్రీజ, సతీష్ రెడ్డి, వేణుగోపాల్, రాజమల్లయ్య, సంతోష్, రఘువీరప్రసాద్, శ్రీనివాస్, రామ్, మధుసూదన్ రెడ్డి, రమేష్ గౌడ్, స్టీఫెన్, మురళి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పర్శ హన్మాండ్లు, పీఏసీఎస్ చైర్మన్ వేషాల వెంకటి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గంగి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ ధాన్యం బకాయిలను గడువులోగా చెల్లించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ధాన్యానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న బకాయిలను నిర్ణీత గడువులోగా పూర్తిగా చెల్లించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు రైస్ మిల్లర్లను ఆదేశించారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ మానిటరింగ్ అధికారి అజయ్‌బాబు (సీఐ)తో కలిసి రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. సీఎంఆర్ ధాన్యం బకాయిల వసూళ్లు, వేలం వేసిన ధాన్యానికి సంబంధించిన మొత్తాల చెల్లింపులు, ప్రస్తుత సీజన్ల సీఎంఆర్ ధాన్యం అప్పగింతలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019–20 సంవత్సరం నుంచి ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2024–25 వరకు పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ ధాన్యం బకాయిలను వెంటనే చెల్లించాలని సూచించారు. రబీ 2022–23 సీజన్‌కు సంబంధించి వేలం వేసిన ధాన్యానికి చెల్లించాల్సిన మొత్తాలను సకాలంలో జమ చేయాలని స్పష్టం చేశారు. అలాగే ఖరీఫ్ 2025–26, రబీ 2025–26 సీజన్లకు సంబంధించిన సీఎంఆర్ ధాన్యం డెలివరీని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలు, జీఓ ఎంఎస్ నంబర్ 17 ప్రకారం పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నింటినీ పూర్తిగా చెల్లించాలని తెలిపారు. చెల్లింపుల్లో జాప్యం చేయకుండా ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తాలను సకాలంలో జమ చేయాలని సూచించారు. అంతకుముందు జిల్లా ఆహార భద్రత అధికారి వాసురామ్‌తో కలిసి ఆహార భద్రత, ప్రమాణాల చట్టం–2006పై నిర్వహించిన ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆహార భద్రత చట్టంలోని నిబంధనలు, ఆహార నాణ్యత ప్రమాణాలు, ప్రజారోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, చట్టం అమలుకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్, జిల్లా మేనేజర్ శ్రీకళ, డిప్యూటీ తహశీల్దార్ (సివిల్ సప్లైస్), రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** భూ సంబంధిత పెండింగ్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారించి, సంబంధిత రికార్డులను పరిశీలించిన అనంతరం నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములుతో కలిసి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ, తహశీల్దార్లతో భూ సంబంధిత అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీసీఎల్ఏ ఆదేశాల మేరకు భూదాన్ భూములకు సంబంధించిన దానపత్రాలు, పంపిణీ పత్రాలను గుర్తించి, భూదాన్ చట్టం ప్రకారం నిర్దేశించిన నమూనాల్లో వివరాలను స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. భూ సంబంధిత కోర్టు కేసుల స్థితిగతులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అవసరమైన కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించారు. భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసేందుకు అవసరమైన అదనపు జీఎన్ఎస్ఎస్ రోవర్ పరికరాలను సమకూర్చుకొని, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. జీఓ నంబర్లు 59, 76 కింద ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియను ప్రారంభించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. భూభారతి పోర్టల్ ద్వారా అందిన పాత, కొత్త ఫార్మాట్లలోని పెండింగ్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారించి, సంబంధిత రికార్డుల ఆధారంగా వేగంగా పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా పాత ఫార్మాట్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నవంబర్ 10వ తేదీలోగా పరిష్కరించాలని అధికారులకు గడువు విధించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. అంతకుముందు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా గణాంక, ప్రణాళిక అధికారి పాపయ్యతో కలిసి జనగణన నిర్వహణపై ఛార్జ్ అధికారులు, అదనపు ఛార్జ్ అధికారులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. డైరెక్టరేట్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ రాష్ట్ర కన్సల్టెంట్ కె.కృష్ణయ్య, మాస్టర్ ట్రైనర్ శరణ్య శిక్షణ అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన నిర్వహణకు సంబంధించి శిక్షణలో ఏవైనా సందేహాలు ఉంటే శిక్షకులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. జనగణన ప్రక్రియ ప్రారంభమయ్యే నాటికి అవసరమైన వివరాలు, రికార్డులతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. సంబంధిత అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ముందస్తు సన్నద్ధతతో ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు, తహశీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 2న కొమురంభీం వర్ధంతి



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** ఆదివాసీ ఆరాధ్య దైవం, హక్కుల పోరాట యోధుడు కొమురంభీం వర్ధంతిని పురస్కరించుకుని నవంబర్ 2న వర్ధంతి వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ సంఘాలు నిర్ణయించాయి. ఈ మేరకు బుధవారం బెజ్జూర్ మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో ఆదివాసీ సంఘం అధ్యక్షుడు కోరేత తిరుపతి అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని ఆదివాసీ పెద్దలు, ఆదివాసీ సర్పంచులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మహిళా సంఘాల ప్రతినిధులు, యువత హాజరయ్యారు. కొమురంభీం ఆశయాలను, ఆదివాసీల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాలను నేటి తరానికి తెలియజేసేలా వర్ధంతి వారోత్సవాలను నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. జల్, జంగల్, జమీన్ నినాదంతో నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి ఆదివాసీల హక్కుల కోసం ప్రాణాలర్పించిన కొమురంభీం త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన చూపిన పోరాట మార్గం ఆదివాసీ సమాజానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఆదివాసీలు అధిక సంఖ్యలో పాల్గొని వర్ధంతి వారోత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు సిడం సకారాం, తొర్రెం బానయ్య, కుమ్రం హన్మంత్, ఆత్రం బక్కయ్య, ఏనుక శంకర్, తలండి తిరుపతి, తలండి రాములు, ఆత్రం సాయి, బండి రాజారాం తదితరులు పాల్గొన్నారు.

# అటవీ శాఖ సమస్యల పరిష్కారానికి కృషి

- అటవీ శాఖకు పోలీసు శాఖ పూర్తి సహకారం అందించాలి
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**ఉద్యమ కెరటం, కామారెడ్డి:** అటవీ ప్రాంతాల పరిరక్షణ, అటవీ సంపద సంరక్షణలో అటవీ శాఖకు పోలీసు శాఖ పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర సూచించారు. అటవీ శాఖ సిబ్బంది విధుల నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కామారెడ్డి కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్, ఐఎఫ్ఎస్ ఆధ్వర్యంలో అటవీ, పోలీసు శాఖల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ అధికారి అటవీ శాఖకు సంబంధించిన వివిధ అంశాలను, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. అటవీ ప్రాంతాల పరిరక్షణ, అటవీ సంపద సంరక్షణ, విధుల నిర్వహణలో అటవీ సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వాటి పరిష్కారానికి పోలీసు శాఖ అందించాల్సిన సహకారంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ అంశాలపై కలెక్టర్, ఎస్పీ సానుకూలంగా స్పందించారు. అటవీ శాఖకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు పోలీసు శాఖ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో విధుల నిర్వహణ సమయంలో ఎదురయ్యే సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, పరస్పర సహకారం ఎంతో ముఖ్యమని పేర్కొన్న అధికారులు, అటవీ ప్రాంతాల పరిరక్షణతో పాటు అటవీ సంపద సంరక్షణ, సిబ్బంది భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవోలు), ఫారెస్ట్ డివిజనల్ అధికారులు (ఎఫ్‌డీవోలు), ఫారెస్ట్ రేంజ్ అధికారులు (ఎఫ్ఆర్‌వోలు), సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక


# డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలి

- మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రతి శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్




**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** డ్రగ్స్, మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలు, ఆరోగ్య సమస్యలపై అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఎస్పీ మహేష్ బి.గితేతో కలిసి జిల్లాస్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్‌డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల నియంత్రణ, శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డీ-అడిక్షన్ కేంద్రాల్లో వైద్య సేవలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణ కోసం సమావేశంలో పాల్గొన్న ప్రతి శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. పోలీస్, ఎక్సైజ్, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. మాదకద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి, వారికి అవసరమైన వైద్య చికిత్సతో పాటు కౌన్సెలింగ్ అందించాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. అటవీ, వ్యవసాయ శాఖ అధికారులు తమ పరిధిలోని అటవీ భూములను పరిశీలించాలని, ఎక్కడైనా గంజాయి సాగు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డ్రగ్స్ వినియోగంతో కలిగే అనర్థాలపై క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య ఆరోగ్య, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో జిల్లాలోని 10 డిగ్రీ కళాశాలలు, 20 జూనియర్ కళాశాలల్లో సుమారు 2,600 మంది విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులతో కమిటీలు ఏర్పాటు చేసి, ప్రతిరోజూ ప్రార్థన సమయంలో మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృత కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే.ఎస్.బి. కుమారి, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా విద్యాధికారి విజయ్ సాగర్, ఇంటర్మీడియట్ విద్యాధికారి శరత్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, జిల్లా ఎక్సైజ్ అధికారి హిమశ్రీ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూషతో పాటు వ్యవసాయ, కార్మిక, అటవీ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# తుపాన్ దెబ్బకు అన్నదాత విలవిల

## చేతికొచ్చే పంట నీటిపాలు

- గిట్టుబాటు ధర ఎక్కడ..?
- అసలే కరువు.. అరకొరగా పండిన పంటకు తుపాన్ దెబ్బ
- తడిసిన ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న దళారులు
- వ్యవసాయ అధికారులు స్పందించి న్యాయం చేయాలని డిమాండ్




**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** అసలే కరువు పరిస్థితులతో సతమతమవుతున్న అన్నదాతలకు అర్నాబ్ తుపాన్ ప్రభావం మరిన్ని కష్టాలను తెచ్చిపెడుతోంది. పంట చేతికొచ్చే సమయంలో కురుస్తున్న వర్షాలతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఆంధ్ర సరిహద్దు సత్తుపల్లి, ఖమ్మం, అశ్వారావుపేట, కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో తుపాన్ ప్రభావంతో పంటలు తడిసిపోతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు, కరువు ప్రభావంతో ఇప్పటికే పంట దిగుబడులు తగ్గి రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎంతో కష్టపడి పండించిన అరకొర పంటను కోత కోసి ఇంటికి చేర్చుకునే సమయంలో వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం తడిసిపోతోంది. దీంతో ధాన్యం నాణ్యత దెబ్బతినడంతో పాటు గిట్టుబాటు ధర లభించదేమోనన్న ఆందోళన రైతుల్లో నెలకొంది.

### తుపాన్ కష్టాలకు తోడు దళారుల దోపిడీ..

ఓ వైపు వర్షాలతో పంట నష్టపోతుండగా, మరోవైపు తడిసిన ధాన్యాన్ని ఆసరాగా చేసుకుని కొందరు దళారులు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత వారంలో క్వింటా ధాన్యానికి రూ.3,300 నుంచి రూ.3,500 వరకు ధర లభించగా, ప్రస్తుతం తడిసిన ధాన్యాన్ని క్వింటాకు కేవలం రూ.2,900కే కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఒక్కో క్వింటాపై రూ.400 నుంచి రూ.600 వరకు నష్టపోవాల్సి వస్తోందని వాపోతున్నారు. వర్షాల కారణంగా ధాన్యాన్ని ఎక్కువ రోజులు నిల్వ ఉంచలేక, చేసేదేమీ లేక తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో ఇప్పటికే నష్టపోయిన తమకు గిట్టుబాటు ధర కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### అధికారులు వెంటనే స్పందించాలి..

తుపాన్ ప్రభావంతో నష్టపోతున్న పంటలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని రైతులు కోరుతున్నారు. తడిసిన ధాన్యం కొనుగోలులో రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, దళారులు తక్కువ ధరలకు కొనుగోలు చేయకుండా పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అవసరమైన ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తెచ్చి, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే విషయంలో నిబంధనలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికే అప్పులు, పెట్టుబడి భారంతో సతమతమవుతున్న అన్నదాతలకు తుపాన్ రూపంలో మరో కష్టం ఎదురుకావడంతో రైతాంగం ఆందోళనలో ఉంది. ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు తక్షణమే స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి, నష్టపోయిన రైతులకు తగిన సహాయం అందించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ, బాధితులకు అందుతున్న వైద్య సహాయం, పీఎం రహత్' పథకం పై బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రధాన ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య సేవలను మరింత పటిష్టం చేయాలని, ముఖ్యంగా జనరల్ ఫిజిషియన్, న్యూరో, ఆర్థో వైద్య నిపుణులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రిమ్స్ ఆసుపత్రికి రోడ్డు ప్రమాద కేసులు ఎక్కువగా వస్తున్నందున, రిమ్స్ పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఉట్నూర్, ఇచ్చోడ ప్రాంతాల నుంచి వచ్చే బాధితుల కేసులను వెంటనే రిమ్స్ ఆసుపత్రికి త్వరగా చేరవేసేలా రవాణా శాఖ అధికారులు, పోలీసు సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. అలాగే, రిమ్స్ డైరెక్టర్, డీఎంహెచ్‌వో పరస్పరం సమన్వయం చేసుకొని వైద్య సేవల తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'పీఎం రహత్' పథకం కింద రోడ్డు ప్రమాద బాధితులకు ఆర్థిక భరోసా లభిస్తుందని, పథకం ద్వారా ప్రమాదంలో గాయపడిన ఒక్కో పేషెంట్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 1.50 లక్షల వరకు వెచ్చించడానికి అవకాశం ఉంటుందని, అర్హులైన బాధితులు ఈ సేవలను సద్వినియోగం చేసుకునేలా అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి సాధన, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రోహిత్, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ సత్యనారాయణ, టీం లీడర్ వ్యాస్, 108 కోఆర్డినేటర్ శేఖర్, ఈ-దార్ మేనేజర్ నితిన్, తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గుడుంబా వద్దంటూ గ్రామస్తుల తీర్మానం

## ఎస్సై రవికుమార్‌కు వినతిపత్రం



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని జంగం గ్రామంలో గుడుంబా బంద్‌కు సంబంధించి గ్రామ ప్రజాప్రతినిధులు పోలీసులను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామ సర్పంచ్ పెందూర్ అనుసయా అర్జున్, ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీతో పాటు వార్డు సభ్యులు బుధవారం స్సై రవికుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా గుడుంబా బంద్‌కు సంబంధించిన అంశాలపై చర్చించి, గ్రామ ప్రజల అభిప్రాయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిశీలించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ ప్రజలకు సంబంధించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు కీర్తన్ లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నవంబర్ 1న ప్రతిభ స్కాలర్షిప్ పరీక్ష

- జిల్లా అదనపు కలెక్టర్, ఇన్చార్జి జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్య



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** నవంబర్ 1వ తేదీన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఇన్చార్జి జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణ కోసం జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలో బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కాలేజ్ రోడ్డులో గల గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలని తెలిపారు.

# షెడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి



**ఉద్యమ కెరటం, జైనూర్:** ఆదివాసీల సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఎత్మసూర్ దేవతల దండారి ఉత్సవాల నిర్వహణకు శాశ్వత షెడ్ నిర్మించాలని, ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం జైనూర్ మండలం రావుజీగూడ గ్రామస్థులు మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహించే దండారి సంబరాల సమయంలో సరైన వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ముఖ్యంగా గుస్సాడీ కళాకారులు విశ్రాంతి తీసుకునేందుకు, ఉత్సవాల నిర్వహణకు అనువైన ప్రదేశం లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఆదివాసీల సాంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుతూ దండారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు శాశ్వత షెడ్ నిర్మాణం ఎంతో అవసరమని వివరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్‌రావు స్పందిస్తూ, షెడ్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కొడప ప్రకాష్, తొడసం రాజేందర్, పంద్రా కౌసల్య షేకు, మడావి లక్ష్మణ్, కోట్నాక బాపూజీ, నాయకులు మెస్రం అంబాజీ, జిల్లా డీసీసీ కార్యవర్గ సభ్యుడు పెందుర్ ప్రకాష్, కుడ్మెత మాధవ్, పెందుర్ మోహన్, రావుజీగూడ గ్రామస్థులు ఆడ అర్జున్, పెందుర్ తనాజీ, ఉర్వేత్ అమృత్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జిందేషా మదార్ దర్గా ఉర్సు వేడుకలు

## గంభీరావుపేటలో భక్తిశ్రద్ధలతో గంధం షరీఫ్ ఊరేగింపు



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండల కేంద్రంలో బుధవారం మహమ్మద్ షరీఫ్ ఆధ్వర్యంలో సీతారాం బజార్ బీసీ కాలోనిలో ఉన్న జిందేషా మదార్ దర్గా వద్ద ఉర్సు వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మహమ్మద్ షరీఫ్ ఇంటి నుంచి గంధం షరీఫ్‌ను ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకువెళ్లారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ ఊరేగింపులో భక్తులు పాల్గొని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జిందేషా మదార్ దర్గాలో ఉర్సు వేడుకల ప్రారంభంతో మండల కేంద్రంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు దర్గాను దర్శించుకుని తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యాలు కలగాలని ప్రార్థించారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలి

## జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**ఉద్యమ కెరటం, కామారెడ్డి:** జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నియంత్రణ, నివారణ చర్యలు, ప్రజల్లో అవగాహన కల్పించే అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై విద్యార్థులు, యువతకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని పేర్కొన్నారు. ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి బి.ముకుంద రెడ్డి మాట్లాడుతూ జనవరి 2026 నుంచి ఇప్పటివరకు జిల్లాలోని 101 పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. ఎన్‌డీపీఎస్ కేసులు 14, అరెస్టయిన వ్యక్తులు 13, స్వాధీనం చేసుకున్న ఎండు గంజాయి: 133.695 కిలోలు, స్వాధీనం చేసుకున్న ఆల్ప్రజోలం: 0.220 గ్రాములు, 24 గంజాయి మొక్కలు ధ్వంసం చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, అటవీ శాఖ అధికారి సూరజ్, ఆర్డీవోలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.